ప్రజా తపన
prajathapana.com
News that matters



**సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.**

- స్వామి వివేకానంద

సంపుటి :01 సంచిక: 65 శనివారం 22 ఏప్రిల్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-



# మారనున్న విజయనగరం రూపు రేఖలు

**ప్రజా తపన ,విజయనగరం:**

విజయనగరం జిల్లా భోగాపురంలో అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి మే 3న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్న విషయం తెలిసిందే. మొత్తం 2,203 ఎకరాల్లో విమానాశ్ర నిర్మాణానికి భూములు సేకరించారు. అదే రోజు ముఖ్యమంత్రి మరో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పూసపాటిరేగ మండలం చింతపల్లిలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగల్ ఇచ్చింది. మే 3న జెట్టీ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేస్తారు. ఈ మేరకు జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. జెట్టీ నిర్మాణంలో భాగంగా మిగిలిన సదుపాయాలు కల్పించేందుకు సుమారు 6 ఎకరాలు కేటాయించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో 19 మత్స్యకార గ్రామాలున్నాయి. ఈ గ్రామాలకు చెందిన సుమారు 10వేల కుటుంబాలు సముద్రంలోని వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. వేటాడిన చేపలను భద్రపర్చేందుకు కోల్డ్ స్టోరేజీలంటూ ప్రత్యేకంగా ఇక్కడ లేవు. ప్రభుత్వం తరపున మార్కెట్ సదుపాయం కూడా లేదు. దీంతో.. ఎంతో కష్టపడి వేటాడిన చేపలను దళారులకు కారుచౌకగా కట్టబెట్టాల్సి వస్తోంది. దీనికితోడు చేపల వేట అనంతరం ఒడ్డుకు చేర్చిన బోట్లు నిలుపుకోవడానికి సరైన సదుపాయం లేదు. జెట్టీ లేకపోవడంతో సముద్రంలోనే లంగరు వేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. తుపాను సమయాల్లో అలల తాకిడికి బోట్లు గల్లంతవతున్నాయి. దీంతో, మత్స్యకారులు రూ.లక్షలు నష్టపోవాల్సి వస్తోంది. సుదీర్ఘకాలంగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. జిల్లాలోని తీర ప్రాంతంలో సరైన ఉపాధి మార్గాలు లేకపోవడం.. కష్టనష్టాలు భరించలేక స్థానిక మత్స్యకారులు గుజరాత్‌లోని హీరావి, ఒడిశాలోని పారాదీప్, కేరళ కొచ్చిన్ తదతర ప్రాంతాలకు వలసపోతూ

02

## జూన్‌లో ఆర్‌బీఐ కీలక నిర్ణయం

**ప్రజా తపన ,ముంబాయి**


భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రజలకు మరోసారి ఉపశమనాన్ని ప్రకటించవచ్చు. ఈ ఏడాది జూన్ నెలలో ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో కూడా, రెపో రేటు పెంపును రిజర్వ్ బ్యాంక్ నిలిపివేయవచ్చు. ఈ నెల ప్రారంభంలో, 3-6 తేదీల్లో జరిగిన సమావేశం కూడా రెపో రేటును కేంద్ర బ్యాంక్ పెంచలేదు, 6.5 శాతం వద్ద యథాతథంగా కొనసాగించింది. దేశంలో ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవడానికి గత ఏడాది మే నెల నుంచి ఆర్‌బీఐ వడ్డీ రేట్లను ఎప్పటికప్పుడు పెంచింది. ఈ పెంపు సరిపోతుందని, ఇక కొత్తగా పెంచాల్సిన అవసరం లేదని భారత రెపో రేటును నిర్ణయించే ప్యానెల్ సభ్యులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో, జూన్ సమావేశంలో కూడా రెపో రేటులో ఎటువంటి మార్పులు చేయకుండా సెంట్రల్ బ్యాంక్ స్థిరంగా ఉంచుతుందని మార్కెట్ భావిస్తోంది. జూన్‌లో జరిగే ద్వైమాసిక (రెండు నెలలకు ఒకసారి) సమీక్షలో రెపో రేటు పెంచకుండా ఉండాలంటే, రెండు ప్రధాన అంశాలపై సెంట్రల్ బ్యాంక్ దృష్టి పెడుతుంది.



1. అసంపూర్తి రుతుపవనాల కారణంగా పంట దిగుబడులు తగ్గి ఆహార ఉత్పత్తుల ధరలు పెరగకూడదు
2. ముడి చమురు ధరలు పెరకూడదు

అంటే, రెపో రేటును నిలకడగా ఉంచడంలో రుతుపవనాలు, ముడి చమురు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పొచ్చు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం కనిపించవచ్చని భారత వాతావరణ విభాగం గతంలోనే హెచ్చరించింది. అంటే, వర్షపాతం తగ్గి ఎండలు మండిపోతాయి. దాని ప్రభావం పంట దిగుబడులపై పడుతుంది. రుతుపవనాల లోపం వల్ల ఏర్పడే ప్రతికూల ప్రభావంతో ద్రవ్యోల్బణం

02



## నేడే రంజాన్ పండుగ

**ప్రజా తపన ,న్యూఢిల్లీ**

గల్ఫ్ దేశాల్లో రంజాన్ పర్వదిన వేడుకులు భక్తిశ్రద్ధలతో జరుగుతు న్నాయి. గురువారం నెలవంక కనిపించడంతో శుక్రవారం పండుగ నిర్వహిస్తున్నారు. అయితే, మనదేశంలో శుక్రవారం నెలవంక కనిపిస్తే శనివారం రంజాన్ పండుగ జరగనుంది. లేకపోతే.. ఆదివారం పండుగ జరుగుతుందని ముస్లిం పెద్దలు ప్రకటించారు. శుక్రవారం నెలవంక దర్శనమిస్తే.. శనివారం రమదాన్ పండుగ జరుపుకోవాలని.. లేకపోతే.. ఆదివారం పండుగను నిర్వహించుకోవాలని రుహియతే హిలాల్ కమిటీ (నెలవంక నిర్ధారణ కమిటీ )ప్రతినిధి ముఫ్తీ మహ్మద్ ఖలీల్

02

## హైకోర్టు ఆదేశాలపై సుప్రీం కోర్టు స్టే

**ప్రజా తపన ,న్యూఢిల్లీ**




వివేక హత్య కేసులో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీం కోర్టు స్టే విధించింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా హైకోర్టు ఆదేశాలపై సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఇది చాలా దారుణమైన ఆర్డర్ అంటూ ఆక్షేపించింది. అన్ యాక్సెప్టబుల్ అంది. వాదనలు పూర్తైన తర్వాత హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇస్తున్నట్టు సుప్రీంకోర్టు చెప్పింది. దీనిపై స్పందించిన అవినాష్ రెడ్డి న్యాయవాది ఇప్పటికిప్పుడు స్టే ఇస్తే తన క్లయింట్‌ను సీబీఐ అరెస్టు చేసే అవకాశం ఉందని అన్నారు. అయితే సోమవారం వరకు అరెస్టు చేయొద్దని ఆదేశాల్లో పేర్కొంది సుప్రీంకోర్టు. అనంతరం ప్రతివాదులకు నోటీసులు కూడా జారీ చేసింది. వివేకా హత్య కేసులో సీబీఐ విచారణ ఎదుర్కొంటున్న ఎంపీ అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, రెండు రోజుల వాదనలు తర్వాత ధర్మాసనం మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 25వ తేదీ వరకూ అవినాశ్ రెడ్డిని అరెస్ట్ చేయవద్దని హైకోర్టు తీర్పు ఇచ్చింది. 25వ తేదీన తుది తీర్పు ఇవ్వనున్నట్లు తెలంగాణ హైకోర్టు వెల్లడించింది. ఈ తెలంగాణ హైకోర్టు నిర్ణయాన్ని వివేకా కుమార్తె సునీత సుప్రీంకోర్టులో సవాలు చేశారు.అవినాష్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు ధర్మాసనం ముందస్తు బెయిల్ ఇవ్వడాన్ని సవాలు చేస్తూ సునీత గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను సుప్రీం కోర్టు విచారణకు స్వీకరించింది. సీజేఐ డివై చంద్రచూడ్ ధర్మాసనం ముందు సునీత పిటీషన్ సీనియర్ న్యాయవాది సిద్ధార్ధ లూద్రా ప్రస్తావించారు. ఇవాళ విచారణకు స్వీకరిస్తామని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. వివేక హత్య కేసులో అవినాష్ రెడ్డికి అరెస్టు వద్దని హైకోర్టు ఊరట కల్పించినా సీబీఐ విచారణకు మాత్రం వెళ్లాల్సిందేనంటూ స్పష్టం చేసింది. దీంతో వరుసుగా

02


## ‘మహమ్మారి ఇంకా ముగియలేదు..!

### 8 రాష్ట్రాలకు కేంద్రం లేఖ

**ప్రజా తపన ,న్యూఢిల్లీ:**

ఎప్పటికప్పుడు రూపాంతరం చెందుతోన్న కొవిడ్ వైరస్ కారణంగా ఇటీవల కొన్ని రాష్ట్రాల్లో మరోసారి కేసుల పెరుగుదల నమోదైన సంగతి తెలిసిందే. దీంతో దేశవ్యాప్తంగా రోజువారీ కేసుల సంఖ్య 11 వేలు దాటింది. యాక్టివ్ కేసుల సంఖ్య 66 వేలకు చేరుకుంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కేసులు పాజిటివిటీ రేటు పెరుగుతోన్న నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలని

02





## ఇస్రో ప్రయోగానికి రంగం సిద్ధం

**ప్రజా తపన ,నెల్లూరు**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఈ నెల 22 వ తేదీన మరో వాణిజ్య ప్రయోగానికి రంగం సిద్ధం చేసింది ఉమ్మడి నెల్లూరు జిల్లా లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ లోని మొదటి ప్రయోగ వేదిక పై నుండి శనివారం మధ్యాహ్నం 2 గంటల 19 నిమిషాలకు ఇస్రో పిఎస్ఎల్వీ -సీ55 రాకెట్ ద్వారా సింగపూర్ కు చెందిన టెల్ ఇయోస్ -2

02



ప్రజా తపన
prajathapana.com

# మారనున్న విజయనగరం రూపు రేఖలు

(మొదటిపేజీ తరువాయి)

కూలీలుగా మారుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా జెట్టీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలా ఏళ్లుగా ఉంది. గతంలో తెదేపా ప్రభుత్వమే దీన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. కానీ, అడుగు ముందుకు పడలేదు. ఎట్టకేలకు వైకాపా ప్రభుత్వం స్పందించింది. రూ.25కోట్లతో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి ముందుకొచ్చింది. ఇది నిరంతరం సముద్రపు ఆటుపోట్లు వచ్చే ప్రాంతంలో కాకుండా నీరు స్థిరంగా ఉండే ప్రాంతంలోనే ఏర్పాటుకు అనువుగా ఉంటుంది. వేటాడిన మత్స్య సంపదను బోటుల నుంచి ఒడ్డుకు చేర్చడానికి, బోటులు లంగరు వేయడానికి మాత్రమే తోడ్పడుతుందని సమాచారం. ఇది పూర్తయితే మత్స్యకారుల సమస్య పరిష్కారం కావడంతోపాటు.. వారు ఆర్థికంగా అభివృద్ధి చెంది, జీవనం మెరుగుపడే అవకాశాలున్నాయి. మే నెల 3 వ తేదీన భోగాపురం విమానాశ్రయం, చింతపల్లి వద్ద ఫ్లోటింగ్ జట్టీ శంకుస్థాపనలకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రానున్నట్లు జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. ఆ మేరకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్షించారు. శంకు స్థాపనకు అవసరమయ్యే శిలాఫలకం, వాహనాల పార్కింగ్ కు అనువైన స్థలాన్ని గుర్తించి ఏర్పాట్లు చేయాలన్నారు. శంకుస్థాపన జరిగే నాటికి ఆర్‌అండ్‌ఆర్ లో ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. అందరికీ గృహాలు, అన్ని సౌకర్యాలతో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. జూన్ నెలలో సాలూరులో గిరిజన విశ్వ విద్యాలయానికి కూడా శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు.

# ఇస్రో ప్రయోగానికి రంగం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నది, 741 కిలోల బరువు కలిగిన సింగపూర్ ఉపగ్రహం తో పాటు 16 కిలోల లుమెలైట్ అనే ఉపగ్రహాన్ని కూడా ప్రగించడానికి సర్వం సిద్ధం చేసింది, ఈ ప్రయోగానికి సంబందించిన కౌంట్ డౌన్ కూడా ప్రయోగానికి 25 :30 గంటల ముందు నుండి ప్రారంభించాలని శాస్త్రవేత్తలు నిర్ణయించడం జరిగింది, ఒక రాకెట్ ప్రయోగాన్ని విజయవంతం చేసి నెల రోజులు పూర్తి కాకముందే మరో రాకెట్ ప్రయోగానికి ఇస్రో సిద్ధం కావడం విశేషం.

**చెంగాలమ్మ ఆలయంలో ఇస్రో అధికారుల పూజలు**

ఇస్రో శనివారం చేపట్టబోయే సిఎస్ఎల్వీ -సి 55 రాకెట్ ప్రయోగం విజయవంతం అవ్వాలని ఇస్రో ఛైర్మన్ ఎస్. సోమనాథ్ సూళ్లూరుపేటలోని చెంగాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగానికి ముందు ఇస్రో ఛైర్మన్,అధికారులు సూళ్లూరుపేట లోని శ్రీ చెంగాలమ్మ అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయం, దీనిలో భాగంగానే ఇస్రో శనివారం మధ్యాహ్నం 2గంటల 20 నిమిషాలకు చేపట్టబోయే రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని పూజలు నిర్వహించారు, ఈ పూజా కార్యక్రమంలో ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఇస్రో ఛైర్మన్ మాట్లాడుతూ ఈ నెల 22న ఇస్రో సింగపూర్ కు చెందిన లియిస్ -2 అనే ఉపగ్రహాన్ని పిఎల్‌ఎవ్వీ రాకెట్ ద్వారా నింగిలోకి పంపనున్నామని దీనికి శుక్రవారం మధ్యాహ్నం 12.20 నిమిషాల నుండి కౌంట్ డౌన్ ప్రక్రియ మొదలు అవుతుందని అన్నారు. శనివారం పు మధ్యాహ్నం 2.20 నిమిషాలకు రాకెట్ ప్రయోగం చేపడతామని ఇది ఈ ఎడిషన్ లో ఇది 5వ ప్రయోగం అని ఈ రాకెట్ ప్రయోగం 8 చిన్న పెలోడ్లు ద్వారా చేపడుతున్నామని ఈ ప్రయోగం విజయవంతం కావాలని అమ్మవారిని కొరుకున్నమని ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ తెలియజేశారు..

# వైకాపా నేతపై హత్యాయత్నం ?

**అనంతపురం**

వైసీపీ నేతపై హత్యయత్నం జరిగినట్లుగా పోలీసులు విచారణ చేపట్టారు. అనంతపురం జిల్లాలోని తాడిపత్రి మండలంలోని బొందలదిన్నెలో వైసీపీ నేతల హరినారాయణ కారును మరో కారు ఢీకొంది. ఈ ఘటన నుంచి హరినారాయణ తప్పించుకున్నారు. అనంతరం హరినారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. కారుతో ఢీకొట్టి హరినారాయణను హత్య చేయాలని ప్లాన్ వేసినట్లుగా భావించిన పోలీసులు ఆయన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నారు.తాడిపత్రిలో అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానిక వైసీపీ నాయకుడు హరినారాయణ రెడ్డి వాహనాన్ని బొందలదిన్నె సమీపంలో మరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదం నుంచి హరినారాయణ సురక్షితంగా బయటపడ్డారు. ఈక్రమంలో హరినారాయణ కారును ఢీకొట్టిన వాహనం డ్రైవర్ పరారైనట్లుగా తెలుస్తోంది. ఈ ప్రమాదంపైతాడిపత్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు. హరినారాయణ కారును ఢీకొన్న వాహనం ఎవరిది? వాహనం డ్రైవర్ ఎవరు? కావాలనే ఢీకొట్టారా? లేక ప్రమాదవశాత్తు ఇలా జరిగిందా? అనేదానిపై దర్యాప్తు చేపట్టారు. హరినాయరణ మాత్రం తన ప్రత్యర్థులు తననుచంపేందుకు ప్రయత్నించారని ఆరోపిస్తున్నారు. నిందితులను గుర్తించి..తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు.

# జూన్‌లో ఆర్‌బీఐ కీలక నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కువ స్థాయిలోనే ఉండవచ్చన్నది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాఆరుగురు సభ్యుల ఓఖళ అభిప్రాయం. అయితే, ప్రతికూల పరిస్థితులను తట్టుకుని పంట ఉత్పత్తి తగ్గకపోయినా లేదా ఆహార పదార్థాల ధరలు పెరగకపోయినా ద్రవ్యోల్బణం అదుపులోనే ఉంటుందని అంచనా.ఒక సంవత్సరం క్రితం గరిష్ట స్థాయిలకు చేరిన కమొడిటీల ధరలు ఇప్పుడు బాగా దిగవచ్చాయి. దీనివల్ల.. వస్తు తయారీ కంపెనీలపై పెట్టుబడి వ్యయాల భారం బాగా తగ్గింది. ఫలితంగా వస్తు ధరలు తగ్గుతాయి. రియల్ ఎస్టేట్ కూడా పుంజుకుంది. కాబట్టి, జూన్ సమావేశంలో కూడా రెపో రేటు పెంచకుండా అడ్డుపడే పరిస్థితులు ప్రస్తుతానికి సానుకూలంగానే ఉన్నాయి.

**2.5 శాతం పెరిగిన రెపో రేటు**

గత ఏడాది మే నెల నుంచి ఇప్పటి వరకు, గత 11 నెలల్లో జరిగిన ఆరు విధాన సమీక్షల్లో రెపో రేటు మొత్తంగా 2.5 శాతం లేదా 250 బేసిస్ పాయింట్లు ఖీఃఐ పెంచింది. గత ఏడాది మే నెల నాటికి ఉన్న 4 శాతం నుంచి ఇప్పుడు 6.5 శాతానికి చేరింది.

# నేడే రంజాన్ పండుగ

(మొదటిపేజీ తరువాయి)

అహ్మద్ వెల్లడించారు. రుహియతే హిలాల్ కమిటీ శుక్రవారం సాయంత్రం 7 గంటల వరకు దీనిపై స్పష్టతనిస్తుందని, దాని ప్రకారం పండుగ జరుపుకోవాలని ఆయన ముస్లింలకు సూచించారు.ఇదిలాఉంటే.. ఇస్లాంలో రంజాన్ మాసం చివరి శుక్రవారానికి ఎక్కువ ప్రధాన్యం ఇస్తారు. ఈ రోజు ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆశీస్సులు పొందుతారు. జుమ్మతుల్ విదాను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని అన్ని మసీదుల వద్ద ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా మక్కా మసీదు, పబ్లిక్ గార్డెన్స్‌లోని రాయల్ మసీదులో జుమ్మతుల్ విదా ప్రార్థనలకు ఏర్పాట్లు చేసినట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. దీంతోపాటు జీహెచ్ఎంసీ పరిధిలోని మసీదు పరిసరాలను కూడా శుభ్రం చేసినట్లు తెలిపారు.రంజాన్ పండుగ నేపథ్యంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని ఈద్గాలలో సామూహిక ప్రార్థనల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు గురువారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ మసీవుల్లా ఖాన్ వెల్లడించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఈద్గాలలో కూడా సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

# ఎన్నికల మూడ్ లోకి సిఎం జగన్

**శ్రీకాకుళం:**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోయారా? అభ్యర్థుల ప్రకటనకు రెడీ అయ్యారా? మరో ఏడాది సమయం మాత్రమే ఉండటంతో ఎన్నికల ప్రచారానికి సైతం సై అంటున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. అందుకు శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం మూలపేటలో శ్రీకారం చుట్టారని తెలుస్తోంది. నౌపడలో జరిగిన సభలో సీఎం వైఎస్ జగన్ ప్రసంగం ఎన్నికల సమరాన్ని తలపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఓటు బ్యాంకును క్యాష్ చేసుకునేందుకు కీలకమైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అలాగే ఎన్నికలమూడ్‌లోకి వెళ్ళిపోయినట్లు సంకేతాలు సైతం ఇచ్చేశారు. ఇతర పార్టీలపై విమర్శల దాడి చేశారు. అదే సందర్భంలో టెక్కలి నియోజకవర్గం అభ్యర్థిని సైతం ప్రకటించేశారు. ఇదే సందర్భంలో వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని కూడా సీఎం జగన్ కోరారు. సీఎం జగన్ ప్రసంగాన్ని పరిశీలిస్తే ఇక సీఎం జగన్ ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోయారని తెలుస్తోందిఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికలకు సై అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో క్లీన్ స్వీప్ లక్ష్యంగా సీఎం జగన్ వ్యూహరచన చేస్తున్నారు. ఇప్పటికే అనేక కార్యక్రమాలతో దూకుడు పెంచారు. అయితే తాజాగా సీఎం జగన్ ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గంలోని నౌపడ బహిరంగ సభలో సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనంగా తెలుస్తోంది. వైనాట్ 175 అనే నినాదంతో సీఎం వైఎస్ జగన్ ఎన్నికలకు వెళ్లనున్నారు. అంతేకాదు అభ్యర్థుల ప్రకటనకు కూడా సిద్ధమైపోయినట్లు తెలుస్తోంది. పీకే సర్వేతోపాటు ఇతర సర్వేలను సైతం సీఎం జగన్ పరిగణలోకి తీసుకుని అభ్యర్థులను ప్రకటించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. మరోవైపు కోడి కత్తికేసు, వైఎస్ వివేకా హత్యకేసు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతికూల పరిస్థితులు ఏర్పడటం, ప్రతిపక్ష తెలుగుదేశం దూకుడు పెంచడంతో ఇక ఎన్నికల సమరంలో సీఎం వైఎస్ జగన్ దూకేసినట్లు తెలుస్తోంది.కలిసొచ్చిన ఏప్రిల్ ప్రకటన2019 ఎన్నికలు ఏప్రిల్ 11న జరిగాయి. మే 23న ఫలితాలు వెల్లడయ్యాయి. బుధవారం ఏప్రిల్ 19 అంటే దాదాపు ఎన్నికలకు ఏడాది సమయం ఉంది. ఈ ఏప్రిల్ నెలలో ఎన్నికలు జరిగినా.. ప్రకటన చేపట్టినా అది కలిసివస్తుందని సీఎం జగన్ భావించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఎన్నికలకు సై అన్నట్లుగా ఇండికేట్స్ ఇచ్చారని తెలుస్తోంది. 2024 ఎన్నికలకు రాజధాని అనేది లేకుండా వెళ్లడం కష్టం కాబట్టి విశాఖనే పరిపాలన రాజధానిగా ప్రకటించారు. సెప్టెంబర్ నుంచి కాపురం కూడా పెడతానని బహిరంగ ప్రకటన చేయడం వెనుక ఉద్దేశం మూడు రాజధానుల అంశమే ఎన్నికలప్రధాన అస్త్రం అని పరోక్షంగా సీఎం జగన్ తెలియజేశారు. జూలైలో రాజధాని అంశంపై కోర్టులో విచారణ జరగనుంది. సెప్టెంబర్‌లోగా విశాఖ పరిపాలన రాజధానిగా లీగల్ ఇష్యూస్‌ని అన్నింటిని అధిగమించి సెప్టంబర్ నుంచి పరిపాలన మొదలు పెట్టడానికి సీఎం జగన్ సన్నద్ధమైపోయినట్లు తెలుస్తోంది.ఇప్పటి వరకు ఎమ్మెల్యే అభ్యర్థులను సీఎం జగన్ ఎక్కడా ప్రకటించలేదు. కానీ తొలిసారిగా శ్రీకాకుళం జిల్లాలో అభ్యర్థిని ప్రకటించారు. అందుకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నౌపడ బహిరంగ సభను సీఎం వైఎస్ జగన్ వేదికగా మార్చుకున్నారు. టెక్కలి నియోజకవర్గం వైసీపీ అభ్యర్థిగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను ప్రకటించారు. టెక్కలి నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో దువ్వాడ శ్రీనివాస్ బరిలో ఉంటారని ప్రకటించారు. దువ్వాడ శ్రీనివాస్‌కు అండగా ఉండాలని.. గెలిపించాలని సీఎం జగన్ కోరారు. ఈ సందర్భంగా దువ్వాడ శ్రీనివాస్ సాగునీటి కోసం రూ.70కోట్లతో చేపట్టాల్సిన పనులకు సీఎం జగన్ గ్రాంట్స్ విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. టెక్కలి వైసీపీ అభ్యర్థిగా ఎలాంటి కన్ఫ్యూజన్ వద్దని తేల్చి చెప్పేశారు. కన్ఫ్యూజన్ ఉంటే నష్టపోతామని ఇక అలాటి పరిస్థితి ఉండకూడదని తేల్చి చెప్పేశారు.దువ్వాడ శ్రీనివాస్‌కు వచ్చే ఎన్నికల్లో



టికెట్ అని సీఎం జగన్ క్లారిటీ ఇచ్చేశారు. ఇకపోతే టెక్కలి నియోజకవర్గం నుంచి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాబట్టి వచ్చే ఎన్నికల్లో దువ్వాడ శ్రీనివాస్ వర్సెస్ అచ్చెన్నాయుడుగా టెక్కలి ఎన్నికలు జరగనున్నాయి.ఇకపోతే ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన పార్టీలపై సీఎం వైఎస్ జగన్ విమర్శల దాడిలో స్పీడు పెంచారు. నౌపడ బహిరంగ సభలో రెచ్చిపోయి మరీ విమర్శలు చేశారు. ఒకే అబద్ధాన్ని పదే పదే చెప్పి అదే నిజమని నమ్మించే చీకటి యుద్ధం రాష్ట్రంలో జరుగుతుందని జగన్ ఆరోపించారు. పేదల పక్షాన నిలబడ్డ మీ బిడ్డకు, వ్యవస్థలను మేనేజ్ చేస్తున్న వారికి మధ్య యుద్ధం జరుగుతుందని సీఎం జగన్ సభలో వెల్లడించారు. వారి మాదిరిగా మీ బిడ్డకు ఎల్లో మీడియా లేవని, దత్తపుత్రుడు లేడంటూ సెటైర్లు వేశారు.ఈ యుద్ధంలో నా ధైర్యం మీరు.. ఈ యుద్ధంలో నా నమ్మకం మీరు. ఈ యుద్ధంలో నా ఆత్మవిశ్వాసం మీరు. మీ బిడ్డ నమ్ముకున్నది.. దేవుడి దయ, మీ చల్లని దీవెనలు అని సీఎం జగన్ స్పష్టం చేశారు. తోడేళ్లంతా ఒక్కటవుతున్నాయి. ఈ అబద్ధాలను నమ్మకండి. వారి మాదిరిగా అబద్ధాలు చెప్పే అలవాటు మీ బిడ్డకు లేదు. మీ ఇంట్లో మంచి జరిగిందా లేదా అనేది మాత్రమే కొలమానంగా తీసుకోండి. మంచి జరిగిందనుకుంటే మీ బిడ్డకు సైనికులుగా మీరే నిలబడండి అని సీఎం వైఎస్ జగన్ పిలుపునిచ్చారు.

# హైకోర్టు ఆదేశాలపై సుప్రీం కోర్టు స్టే

(మొదటిపేజీ తరువాయి)

మూడు రోజుల నుంచి అవినాష్ రెడ్డి సీబీఐ విచారణకు హాజరవుతున్నారు. రెండు రోజులుగా సుదీర్ఘంగా అవినాష్ రెడ్డిని కేంద్ర దర్యాప్తు సంస్థ అధికారులు విచారిస్తున్నారు. వైఎస్ వివేకా హత్య జరిగిన రోజు జరిగిన పరిణామాలపై సీబీఐ అధికారులు ఆరా తీశారు. అవినాష్ రెడ్డి రాజకీయ ఎంట్రీపైన కూడా సీబీఐ అధికారులు కూపీ లాగారు. నిందితులతో జరిపిన ఆర్థిక లావాదేవీల పైన కూడా సీబీఐ అధికారులు ప్రశ్నించారు. రూ.40 కోట్ల డీల్ పై అవినాష్ రెడ్డి పాత్ర ఏంటనేదానిపైన కూడా సీబీఐ అధికారులు ఆరా తీశారు. సహజ మరణంగా ఎందుకు చిత్రీకరించారని సీబీఐ అధికారులు ప్రశ్నించినట్టు తెలుస్తోంది. కొత్త విచారణ అధికారి వికాస్ సింగ్ కు అవినాష్ రెడ్డి లేఖ రాశారు. వైఎస్ వివేకా హత్య జరిగిన రోజు దొరికిన లేఖపై దర్యాప్తు జరపాలని అవినాష్ రెడ్డి కోరారు. వివేకా ఫోన్ లో ఉన్న వివరాలు బయట పెట్టాలని అవినాష్ కోరారు. వివేకానంద రెడ్డి అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్ ను ఎందుకు విచారణ చేయడం లేదని అవినాష్ రెడ్డి ప్రశ్నించారు.అవినాష్ రెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డిని, మరో వ్యక్తి ఉదయ్ కుమార్ ను సీబీఐ అధికారులు కస్టడీలోకి తీసుకొని విచారించారు. బుధ, గురువారాల్లో ఉదయం చంచల్ గూడా జైలు నుంచి నిందితులను కస్టడీ లోకి తీసుకొని వాళ్లను కూడా సుదీర్ఘంగా విచారించారు. ఇప్పటికే ఇద్దరినీ ఆరు రోజుల పాటు కస్టడీకి నాంపల్లి సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య నిందితులతో ఉన్న పరిచయాలపై సీబీఐ అధికారులు ఆరా తీస్తున్నారు. సునీల్ యాదవ్ కు కోటి రూపాయలు ఇచ్చారని దస్తగిరి ఇచ్చిన స్టేట్ మెంట్ ఆధారంగా చేసుకొని సీబీఐ అధికారులు ప్రశ్నించినట్టు తెలుస్తోంది.

# తెలంగాణ కాంగ్రెస్‌లో సరికొత్త చర్చలు

**హైదరాబాద్**

తెలంగాణలో అప్పుడే ఎలక్షన్ వాతావరణం కనిపిస్తోంది. రాబోయే ఎన్నికల్లో సత్తా చాటేందుకు అన్ని పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. ఈసారి ఎలాగైనా తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే.. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, మాజీ ఎంపీ రేణుకా చౌదరి ఇంట్లో పలువురు కాంగ్రెస్ నాయకులు సమావేశమయ్యారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితోపాటు మాజీ ఎంపీలు బలరాం నాయక్, సురేశ్ షట్కర్, ఇతర నేతలు హాజరయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాలపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. కానీ.. ఈ భేటీ వ్యవహారంపై ఇప్పుడు తెలంగాణలో కొత్త చర్చలు నడుస్తున్నాయి.వాస్తవానికి.. టీ కాంగ్రెస్‌లో రేవంత్‌రెడ్డి రాజకీయాన్ని ఆ పార్టీలోని సీనియర్లు బహిరంగంగానే వ్యతిరేకిస్తూ వస్తున్నారు. మొన్నామధ్య ఏకంగా భట్టీ ఇంట్లో లంచ్ మీటింగ్ ఏర్పాటు చేసి మరీ రేవంత్‌రెడ్డి తీరుపై ఫైరయ్యారు. ఆ తర్వాత.. అధిష్టానం రంగంలో దిగి ఆ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టినా చాపకింద నీరులా విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆ సంగతి అలా ఉంటే.. కొద్దిరోజులు నుంచి మళ్లీ తెలంగాణ కాంగ్రెస్‌లో సీఎం పదవిపై చర్చోపచర్చలు కొనసాగుతున్నాయి. సీఎం పదవి విషయంలో రేవంత్‌రెడ్డి– భట్టివిక్రమార్క మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రేవంత్‌రెడ్డి సీఎం కావాలని కొందరు అంటుంటే.. ఆయన వ్యతిరేక వర్గం మాత్రం దళిత సీఎం యాంగిల్‌లో భట్టి విక్రమార్క పేరును తెరపైకి తెస్తోంది. ఇప్పుడీ వ్యవహారం టీకాంగ్రెస్‌లో సెగలు పుట్టిస్తోంది.ఇదిలావుంటే.. ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌లో రేణుకచౌదరి– భట్టి విక్రమార్క మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందని ఎప్పటినుంచో టాక్ ఉంది. వాళ్లిద్దరికీ ఏమాత్రం పొసగదని తెలుసు. సరిగ్గా ఈ సమయంలోనే.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగారు. ఆయా పరిస్థితులను ఆయన అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. దానిలో భాగంగానే.. సడెన్‌గా రేణుకాచౌదరి ఇంటికి రేవంత్‌రెడ్డి తన వర్గంతో వెళ్లారని టాక్ నడుస్తోంది. శతృవుకు శతృవు మిత్రుడన్నట్లుగా రేణుకాచౌదరి ఇంట్లో రేవంత్‌రెడ్డి సమావేశం ఏర్పాటు చేయించారని సొంత పార్టీలోనే చర్చలు సాగుతున్నాయి. పైకి.. ఖమ్మంలో జరిగే నిరుద్యోగ నిరసన బహిరంగ సభపై చర్చ జరిగిందని టీకాంగ్రెస్ నేతలు చెప్పుకొస్తున్నా.. అసలు కథ వేరే ఉందన్న టాక్ వినిస్తోంది. అంతేకాదు.. మొన్నామధ్య జరిగిన టీకాంగ్రెస్ సభకు భట్టీ వర్గం ఖర్గేను తెప్పిస్తే.. త్వరలో హైదరాబాద్ జరగబోయే నిరుద్యోగ నిరసన సభకు రేవంత్‌రెడ్డి వర్గం ప్రియాంకాగాంధీని రప్పించేందుకు వ్యూహం రచిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా.. రేణుకాచౌదరి ఇంట్లో రేవంత్‌రెడ్డి టీమ్ సమావేశం కావడం తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త చర్చకు తెరలేపింది. సీఎం పదవి విషయంలో భట్టివిక్రమార్క– రేవంత్‌రెడ్డి మధ్య కోల్డ్ వార్ జరుగుతున్న వేళ.. రేణుకతో రేవంత్ భేటీ కావడం ఆసక్తి రేపుతోంది. అయితే.. భట్టీకి చెక్ పెట్టేందుకే రేవంత్‌రెడ్డి.. రేణుకాచౌదరి ఇంట్లో మీటింగ్ పెట్టించారా?.. లేక.. వ్యతిరేక వర్గంతో ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారా అన్నది చూడాలి.

# మహమ్మారి ఇంకా ముగియలేదు

(మొదటిపేజీ తరువాయి)

ఎనిమిది రాష్ట్రాలకు లేఖ రాసింది. ఉత్తర్‌ప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్, మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, హరియాణా, దిల్లీ ఈ జాబితాలో ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లోని మొత్తం 63 జిల్లాల్లో పాజిటివిటీ రేటు 10 దాటింది.

మహమ్మారి ఇంకా ముగియలేదు. వైరస్ కట్టడి విషయంలో అలసత్వం వహించకుండా.. అప్రమత్తంగా వ్యవహరించాలి' అని కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి రాజేష్ భూషణ్ రాష్ట్రాలకు రాసిన లేఖలో పేర్కొన్నారు. కొవిడ్ కారణంగా ఆసుపత్రిలో చేరికలు, మరణాల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ.. అధిక సంఖ్యలో కేసుల నమోదు స్థానికంగా వైరస్ వ్యాప్తిని సూచిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో.. ప్రారంభ దశలోనే దీన్ని నియంత్రించేందుకు అవసరమైన ప్రజారోగ్య చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని జిల్లాల్లో కొవిడ్ వ్యాప్తిపై పర్యవేక్షణను పెంచాలని, ఇన్‌ఫ్లుయెంజా, శ్వాసకోస ఇన్ఫెక్షన్ల కేసులపైనా దృష్టి సారించాలని తెలిపారు. జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పంపే నమూనాల సంఖ్యనూ పెంచాలని చెప్పారు.

ప్రజాతపన prajathapana.com

# కాంగ్రెస్ గూటికి పొంగులేటి, జూపల్లి

**హైదరాబాద్ :**

బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ అయిన నేతలు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. సరూర్ నగర్ లో నిర్వహించే నిరుద్యోగ దీక్షకు ప్రియాంక గాంధీ హాజరుకానుండగా తొలిసారి రాష్ట్రంలో పర్యటిస్తున్న ప్రియాంక గాంధీ సమక్షంలో ఇరువురు పార్టీలో చేరనున్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, రేణుకా చౌదరి ఇంట్లో చర్చలు జరిపారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వీరిని చేర్చుకోవడంతో కాంగ్రెస్ ఒక దూకుడైన సిద్ధాంతంలో ముందుకు వెళు న్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఇంకా పెద్ద ఎత్తున చేరికలు చేయాలని నిర్ణయించినట్లు స్పష్టమవుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. తెలంగాణలో కేసీఆర్ సర్కార్ కు గట్టి పోటీ ఇచ్చేలా కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది. రాష్ట్రంలో బలంగా పార్టీని తీసుకు వెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. బలమైన లీడర్లను చేర్చుకోగలిగితే వాళ్ల స్థాన బలంతో గెలుస్తామని కాంగ్రెస్ భావిస్తుంది. ఈ క్రమంలోనే పొంగులేటి, జూపల్లి సహా బీఆర్ఎస్, బీజేపీ అసంతృప్త నేతలపై కాంగ్రెస్ పార్టీ గురి పెట్టింది. రాష్ట్రంలో రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సర్కార్ పై ఉన్న వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకోవాలనే ప్రయాత్నాల్లో కాంగ్రెస్ ఉంది. పొంగులేటి, జూపల్లికి ప్రజాబలం ఉండటంతో పాటు ఆర్థికంగా బలమైన నేతలు కావడంతో రాహుల్ గాంధీ టీమ్ వారితో చర్చలు జరిపింది. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, పోదెం వీరయ్య నియోజకవర్గాలు మినహా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మిగతా సీట్లన్నీ పొంగులేటి అనుచరులకు ఇచ్చేందుకు రాహుల్ గాంధీ టీమ్ అంగీకరించినట్లు తెలుస్తోంది. మరోవైపు జూపల్లి కృష్ణారావు ఉమ్మడి మహబూబ్ నగర్ లో తనతో పాటు తన సన్నిహితులకు టికెట్లు ఇవ్వాలని కోరుతున్నాడు. దీంతో పాటు ఆయనపై ఢిల్లీ నుంచి హస్తం పెద్దలు ఒత్తిడి తెస్తున్నారు. కేసీఆర్ ను ఓడించాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ లో చేరితేనే నెరవేరుతుందని.. ఈ టైంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని హస్తం నేతలు సూచించినట్లు తెలుస్తోంది. ఇక ఈ ఇద్దరు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సానుకూలంగా స్పందించడంతో ఈ నెల 30వ తారీఖున వీరు చేరుతున్నట్లు తెలుస్తుంది.

### నల్గొండ దీక్ష రద్దు

తెలంగాణ కాంగ్రెస్ లో మరోసారి ఇంటిపోరు రచ్చకెక్కింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపట్టిన నిరుద్యోగ నిరసనకు కాంగ్రెస్ సీనియర్లు చెక్ పెట్టారు. దీంతో నల్గొండ జిల్లాలో ఎంజీ యూనివర్సిటీలో రేవంత్ రెడ్డి తలపెట్టిన నిరుద్యోగ నిరసన రద్దు చేసుకోవాల్సి వచ్చింది. తన జిల్లాలో తనకు తెలియకుండా పార్టీ కార్యక్రమాలు చేపట్టడం ఏంటని ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఈ విషయాన్ని ఆయన పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లడంతో దీంతో టీపీసీసీ ఈ నిరసన సభను రద్దు చేసింది. తనకు సమాచారం ఇవ్వకుండానే నిరుద్యోగ సభ ఏర్పాటు చేశారని ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి... కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జ్ థాక్రేకు ఫిర్యాదు చేశారు. ఈ వివాదం మరింత ముదిరే అవకాశం ఉందనో లేక అధిష్ఠానం ఆదేశించిందో గానీ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఈ సభను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. కాంగ్రెస్ సీనియర్లు రేవంత్ రెడ్డికి చెక్ పెట్టేందుకే ఇలా చేశారని ప్రచారం జరుగుతోంది. తెలంగాణ కాంగ్రెస్ లో తిరుగులేని స్థితిలో ఉన్న రేవంత్‌రెడ్డికి తొలిసారి గట్ట ఎదురుదెబ్బ తగిలింది. ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి అభ్యంతరంతో రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించిన నల్గొండ నిరుద్యోగ నిరసన దీక్షను రద్దు చేస్తున్నట్టు ప్రకటించాల్సి వచ్చింది. దీంతో అసలు కాంగ్రెస్ వర్సెస్ వలస కాంగ్రెస్ పోరులో సీనియర్లతో పైచేయిగా నిలిచింది. రేవంత్ రెడ్డి ప్రకటనపై ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తన జిల్లాలో తనకు కనీస సమాచారం ఇవ్వకుండా, చర్చించకుండా ఏ విధంగా సభ నిర్వహిస్తారని మీడియా పరంగా విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దీక్షపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు ఉత్తమ్ కుమార్ రెడ్డి. దీంతో అధిష్ఠానం ఆదేశించిందో లేక ఆయనే వెనక్కి తగ్గారో కానీ రేవంత్ రెడ్డి నిరుద్యోగ నిరసన విరమించుకున్నారు. బీఆర్ఎస్ కు తామే ప్రత్యామ్నాయమని చెప్పే కాంగ్రెస్ రానున్న ఎన్నికల కోసం కొన్ని రోజులుగా ప్రత్యేక కార్యక్రమాలు చేస్తూ వస్తోంది. రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్ర స్ఫూర్తితో హాథ్ సే జోడో యాత్ర పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు చేసిన విషయం తెలిసిందే. ఇలాంటి పలు కార్యక్రమాలు చేపట్టి కాంగ్రెస్ శ్రేణులను తిరిగి యాక్టివేట్ చేసే పనిలో పడింది కాంగ్రెస్ నాయకత్వం. తాజాగా టీఎస్పీఎస్సీ ప్రశ్నా పత్రాల లీక్ వ్యవహారాన్ని కూడా సమర్థంగా వాడుకుంది. క్వశ్చన్ పేపర్ల లీకులతో నిరుద్యోగుల సమస్యలు మరోసారి ఫోకస్ చేస్తూ నిరసన కార్యక్రమాలు చేపడుతోంది. నల్గొండ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లు జరగాల్సి ఉండగా.. నిరసన కార్యక్రమంపై తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. నల్గొండ మహాత్మా గాంధీ యూనివర్సిటీలో చేపట్టాల్సిన నిరసన కార్యక్రమం గురించి తనకేమీ తెలియదని ఉత్తమ్ అన్నారు. స్థానిక పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న తనతో చర్చించకుడానే నిరసన కార్యక్రమ నిర్ణయం తీసుకున్నారని, అంతే కాకుండా మాజీ పీసీసీ అధ్యక్షుడు, స్థానిక ఎంపీ అయిన తనకు అధికారిక సమాచారం కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ విషయంలో అసంతృప్తితో ఉన్నట్లు తాను ఎవరితోనూ చెప్పలేదని, తనతో చర్చించి నిరసన కార్యక్రమం చేపట్టి ఉంటే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. తన పార్టీ తన నియోజకవర్గంలో నిరుద్యోగ నిరసన కార్యక్రమంలో నిర్వహిస్తుందన్న విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.

# పాలేరులో చతుర్ముఖ పోటీ తప్పదా

**ఖమ్మం:**

ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం మీద ప్రధాన పార్టీల ముఖ్య నేతల కన్ను పడింది. మేమంటే మేమంటూ ఈసారి పలువురు నాయకులు ఇక్కడి నుంచి పోటీకి సిద్ధమవుతున్నారు. తుమ్మల నాగేశ్వరరావు, తమ్మినేని సీతారామ్, వైఎస్ షర్మిల లాంటి నాయకులంతా పాలేరు పోరుకు సిద్ధమవుతున్నారట. మొదటి నుంచి కాంగ్రెస్‌కు పట్టు ఉన్న నియోజకవర్గంగా పాలేరుకు పేరుంది. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ఎక్కువసార్లు ఇక్కడి నుంచి ఆ పార్టీనే గెలిచింది. వివిధ కోణాల్లో చూస్తే? ఇక్కడ సమీకరణలు విచిత్రంగా ఉంటాయి. అందుకే నాయకులంతా ఎవరికి వారు పోటీకి ఉవ్విళ్ళూరుతున్నారు. సామాజిక సమీకరణల పరంగా చూస్తే?. పాలేరులో కమ్మ సామాజికవర్గం ఓట్లు ఎక్కువ. కానీ? రాజకీయంగా రెడ్ల ఆధిపత్యం ఉంటుంది. కమ్యూనిస్ట్‌లకు కూడా పట్టున్న ప్రాంతం ఇది. భౌగోళికంగా తెలంగాణలో ఉన్నా? ఆంధ్ర ప్రాంత ప్రభావం ఉంటుంది. ఇలా? భిన్న కోణాల్లో ఈ నియోజకవర్గానికి ప్రత్యేకత ఉంది. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచి తర్వాత గులాబీ కండువా కప్పుకున్నారు కందాల ఉపేందర్‌రెడ్డి. సిట్టింగ్ ఎమ్మెల్యేగా మరోసారి ఇదే సీటును అధికార పార్టీ తరపున ఆశిస్తున్నారు ఆయన. స్వతహాగా కాంట్రాక్టర్ అయిన ఉపేందర్‌రెడ్డికి స్థానికంగా బంధువర్గం కూడా ఎక్కువగానే ఉంది. అదే సమయంలో ఇక్కడి నుంచి పోటీచేయాలని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన ప్రయత్నాల్లో ఉన్నారు. బిఆర్ఎస్ నుంచి తనకే సీటు వస్తుందని నమ్మకంతో ఉన్నారట తుమ్మల. సీఎం కేసీఆర్‌తో తనకున్న సాన్నిహిత్యం ఉపయోగపడుతుందని, ఈసారి పాలేరు సీటు నాదేనని చెబుతున్నారట ఆయన. గతంలో ఉప ఎన్నికలో గెలిచినప్పుడు తాను చేసిన అభివృద్ధిని కూడా గుర్తు చేస్తున్నారట తుమ్మల. సిట్టింగ్‌గా కందాల ఉపేందర్‌రెడ్డి కూడా అధికార పార్టీ రేసులో నేనే ఉన్నానని చెబుతున్నారట. గతంలో తుమ్మల అనుచరులుగా ఉన్న వారంతా ఇప్పుడు కందాల వద్దకు వచ్చి చేరిపోయారు. దీంతో తుమ్మల, కందాల వర్గాల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఏర్పడిందట. అధికార పార్టీలోనే ఇంత పోటీ ఉంటే? కలిసి పోటీ చేయాలనుకుంటున్న సీపీఎం కూడా ఎంట్రీ ఇచ్చింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఇక్కడి నుంచి బరిలో దిగాలనుకుంటున్నారట. నియోజకవర్గంలోని కల్లూర్‌పల్లి ఆయన సొంత గ్రామం. అందుకే పొత్తులో భాగంగా ఈ సీటును తమకే అడగాలని అనుకుంటున్నారట వీరభద్రం. మరోవైపు?పాలేరులో పాగా వేయాలని వైఎస్ఆర్ టిపి అధ్యక్షురాలు షర్మిల ప్రయత్నిస్తున్నారు. ఈ మట్టి సాక్షిగా తాను పాలేరు బిడ్డనని చెబుతూ పోటీ చేసి గెలుస్తానన్న ధీమాతో ఉన్నారట ఆమె. బలంగా ఉన్న రెడ్డి సామాజికవర్గం, ఆంధ్రా ప్రభావం తనకు ప్లస్ అవుతాయని అనుకుంటున్నారట ఆమె. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు బలమైన నాయకులు లేకుండాపోయారు. ఆ పార్టీ నుంచి గ్రానైట్ వ్యాపారి రాయల నాగేశ్వరరావు రంగంలోకి దిగే అవకాశం ఉంది. రాయల నాగేశ్వరరావు మొన్నటి స్థానిక ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆయన రేణుకాచౌదరిని నమ్ముకొని పాలేరు నుంచి ఎంఎల్ఏగా పోటీ చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అయితే కీలకమైన రాజకీయం మొత్తం తుమ్మల, కందాల, తమ్మినేని, షర్మిల చుట్టూనే తిరుగుతోంది.

# అదానీ నుంచి ఆనంద్ మహీంద్ర వరకు అందరి గుర్తింపు రద్దు

**న్యూఢిల్లీ**



నెలనెలా ఛార్జీ చెల్లించిన వారికి మాత్రమే ట్విట్టర్ అకౌంట్ లెగసీ బ్లూ చెక్ మార్క్‌ను ఏప్రిల్ 20, 2023 నుంచి ఇస్తామన్న ఎలాన్ మస్క్ ప్రకటన అమల్లోకి వచ్చింది. బుధవారం అర్థరాత్రి తర్వాత (తెల్లవారితే గురువారం), చాలా మంది సెలబ్రిటీల బ్లూ టిక్‌లు ఒక్కసారిగా మాయమయ్యాయి. ట్విట్టర్ బ్లూ కోసం సబ్‌స్క్రిప్షన్ తీసుకున్నవారికి మాత్రమే ఇకపై బ్లూ టిక్ మార్క్‌ను ఆ మైక్రో బ్లాగింగ్ సంస్థ ఇస్తుంది. భారతదేశంలోని వ్యాపార సామ్రాజ్యాధినేతలు, బిలియనీర్ల ట్విట్టర్ అకౌంట్లలో బ్లూ టిక్‌లు మాయం అయ్యాయి. వెటరన్ బిలియనీర్ రతన్ టాటా, మహీంద్ర అండ్ మహీంద్ర గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్ర, అదానీ గ్రూప్ ఓనర్ గౌతమ్ అదానీ మొదలుకుని చాలా మంది ప్రముఖ వ్యాపారవేత్తల బ్లూ టిక్‌లు మాయం అయ్యాయి. ఒక్క వ్యాపారవేత్తలే కాదు.. అన్ని రంగాల ప్రముఖులు ఎలాన్ మస్క్ బాధితులుగా మారారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, సినీ నటులు చిరంజీవి, రామ్‌చరణ్, అల్లు అర్జున్, నాని, రజనీకాంత్, షారుక్‌ఖాన్, సల్మాన్ ఖాన్, క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, మహేంద్ర సింగ్ ధోనీ ఖాతాల నుంచి బ్లూ చెక్ మార్క్ తొలగించారు. ఇంతకు ముందు, ట్విట్టర్ ఖాతాలో బ్లూ టిక్ తొలగింపునకు సంబంధించిన తేదీని చాలాసార్లు మార్చారు, కానీ ఈసారి నిజంగానే బ్లూ టిక్ తొలగించారు. ట్విట్టర్ ఒరిజినల్ బ్లూ చెక్ సిస్టమ్ కింద, దాదాపు 3,00,000 ధృవీకరించిన ఖాతాల గుర్తింపును రద్దు చేశారు. అంటే, ఈ ఖాతాల నుంచి బ్లూ టిక్ కనిపించకుండాపోయింది. వీటిలో ఎక్కువ ఖాతాలు పాత్రికేయులు, క్రీడాకారులు, కళాకారులు ఉన్నారు. గురువారం బ్లూ చెక్‌లను కోల్పోయిన హై-ప్రొఫైల్ యూజర్‌లలో బియాన్స్, పోప్ ఫ్రాన్సిస్, ఓప్రా విన్‌ఫ్రే, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఉన్నారు. ట్విట్టర్ బ్లూ టిక్ అంటే, సదరు వ్యక్తి లేదా ప్రముఖుడి అధికారిక ట్విట్టర్ ఖాతా అదేనని ధృవీకరించే గుర్తు. ఒక ప్రముఖుడి పేరు మీద ఎన్ని ట్విట్టర్ ఖాతాలు ఉన్నా, బ్లూ టిక్ ఉన్న ఖాతాను అధికారిక ఖాతాగా ఫాలోవర్లు గుర్తిస్తారు, ఆ ఖాతాలో కనిపించే సమాచారాన్ని విశ్వసిస్తారు. ఏప్రిల్ 20, 2023 ముందు వరకు ఈ బ్లూ టిక్ ఉచితం. ఇప్పుడు, ట్విట్టర్ ఆదాయాన్ని పెంచుకునే వ్యూహాల్లో భాగంగా, బ్లూ టిక్‌కు సబ్‌స్క్రిప్షన్ తీసుకువచ్చారు ఎలాన్ మస్క్. అంటే, బ్లూ టిక్ పొందడానికి వినియోగదార్లు నెలనెలా డబ్బు చెల్లించాలి. బ్లూ టిక్ కోసం నెలవారీ రుసుము రూ. 900. వెబ్ వినియోగదార్లు రూ. 650 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. బ్లూ టిక్ అవసరం లేదనుకున్నవాళ్లు ఉచితంగానే ట్విట్టర్ ఖాతాను నిర్వహించుకోవచ్చు. 2022 అక్టోబర్‌లో, మైక్రో బ్లాగింగ్ సైట్ ట్విట్టర్‌ను 44 బిలియన్ డాలర్లకు ఎలాన్ మస్క్ కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ట్విట్టర్‌లో చాలా పెద్ద మార్పులు చేశారు. సగం మందికిపైగా ఉద్యోగులను కూడా తొలగించారు.

# అన్నవరంలో ఆన్ లైన్ సేవలు

**కాకినాడ :**

కొవిడ్ తర్వాత అనేక మార్పులు వచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో ఒక్క రంగం అని కాదు... ప్రతి వ్యవస్థలోనూ మార్పులు చూస్తున్నాం. ఈ జాబితాలో ఆలయాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా ఆన్ లైన్ వ్యవస్థను బలపేతం చేయటంపై దృష్టిపెట్టాయి. భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ సేవలను పట్టాలెక్కించే పనిలో పడ్డాయి ప్రభుత్వాలు. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రముఖ ఆలయాల్లో ఆన్ లైన్ సేవలను అందుబాటులోకి తీసుకొనిరాగా తాజాగా అన్నవరం దేవస్థానం కూడా ఆ దిశగా అడుగులు వేసిందిఅన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానం ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ సేవలు పొందవచ్చని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి పూజ, దర్శనం, ప్రసాదం, కల్యాణకట్ట, అన్నదానం టికెట్లు, వసతి గదులు, కల్యాణ మండపాలను ముందస్తుగా బుకింగ్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఇందులో వెళ్లగానే ఆన్ లైన్ సేవలు ఉన్న ఆలయాల పేర్లు కనిపిస్తాయి. ఇందులో అన్నవరం అనే ఆప్షన్ పై క్లిక్ చేయాలి. ఇక్కడ మీకు పలు సేవల పేర్లు కనిపిస్తాయి. బుకింగ్ అనే ఆప్షన్ పై క్లిక్ చేసి ప్రాసెస్ పూర్తి చేయవచ్చు. ఫోన్ నంబరు ఆధారంగా లాగిన్ అయ్యి ఆన్‌లైన్ సేవలు పొందాల్సి ఉంటుంది. ప్రముఖ ఆలయాల్లో ఆన్ లైన్ వ్యవస్థ తీసుకురావటంపై ఏపీ ప్రభుత్వం దృష్టిపెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటికే విజయవాడ కనకదుర్గ ఆలయం, ద్వారకా తిరుమల, అన్నవరం, సింహాచలం, విశాఖ పట్నం, శ్రీకాళహస్తి, కాణిపాకం, పెనుగంచిప్రోలు ఆలయాల్లో కూడా ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆలయ భూములు, ఆభరణాలపై కూడా జియో ట్యాగింగ్ చేశారు. ఆలయాల్లో ఆర్థిక లావాదేవీలన్నీ పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలోనూ ఆన్ లైన్ సేవలు ప్రారంభం అయ్యాయి. ఫలితంగా భక్తులు ముందస్తుగానే బుకింగ్ చేసుకునే వీలు ఏర్పడింది.

# మెదక్ లో మేక తలకాయల ఆఫర్

**మెదక్ :**

ఫ్రీగా వస్తుందంటే ఏ ఛాన్స్ మిస్ చేసుకోను మనోళ్లు. ఏదైన ఉచితంగా లభిస్తుందంటే చాలు దాని కోసం ఎంతకైన వెళ్లారు. అసలు విషయం ఏంటంటే? మేక తలకాయలు, కాళ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా కొట్టడంతో.. పాయా అంటే ఇష్టపడే వారి పంట పండింది. రూపాయికి బిర్యాణీ అంటేనే కిలోమీటరు పొడువున క్యూ ఉన్నా.. ఇబ్బంది పడకుండా చేతికి టోకెన్ వచ్చేంత వరకు వెయిట్ చేస్తారు. అదే మేక తలకాయలు, కాళ్ల ఊరుకుంటారా..? ఫ్రీగా వస్తుంటే వదుకోవడం సమజసం కాదను కున్నారో ఏమో కానీ.. క్షణాల్లో వచ్చేశారు జనం. చేతిలో పెద్ద కవర్ పట్టుకుని వచ్చి, చేతికందినన్ని మేక తలకాయలు, కాళ్ల తీసుకు పోయారు. ఈ ఘటన మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరిగింది. తూప్రాన్‌లో మీదుగా మేక తల కాయలు, కాళ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. మేక తలకాయ కాళ్లు రోడ్లపై పడిపోయాయి. దీంతో రామాయంపేట వాసులు కాళ్ళు, తలకాయలు తీసుకెళ్లడానికి ఎగబడ్డారు. అందరికి మందికి నోరూరించే మేక తలకాయలు, కాళ్ల కూర అంటే తెగ ఇష్టపడుతారు. వాటి ధర కూడా మార్కెట్‌లో ప్రస్తుతం భారీగానే పలుకుతోంది. దీంతో దొరికిందే అవకాశమని జనం ఒక్కసారిగా పరుగులు తీస్తూ వచ్చారు. చేతికందినన్ని మేక తలకాయలు, కాళ్ల తీసుకుని ఎంచక్కా ఇంటికి పోయారు. కొందరైతే తమ దగ్గర ఉన్న సంచుల లోనూ, ఇంకొందరు ఏమీ లేకపోవడంతో రెండు చేతుల్లో నాలుగు మేక తలకాయలు తీసుకుని ఇంటికి తీసుకు పోయారు. కాళ్ళు, తలకాయల కోసం చాలా మంది ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో వాహనాలు నిలిచి పోయాయి. భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కొందరు వాహనదారులు కూడా ఉట్టి చేతులతో వెళ్లడం ఎందుక నుకున్నారో ఏమో? ఒక తల నాలుగు కాళ్లు పట్టుకెళ్లారు. దీంతో గంటలో లోడ్ మొత్తం ఖాళీ అయింది. ఉత్తర ప్రదేశ్ లక్నో నుంచి హైదరాబాద్ కు మేక తలకాయలు, కాళ్లు ఐస్ బాక్స్ ల్లో తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కి గాయాలయ్యాయి.

# కర్ణాటక లో 224 నియోజకవర్గాలు 5,102 నామినేషన్లు

**బెంగళూరు**

కర్నాటలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. గురువారం నామినేషన్లఘట్టం ముగిసింది. 224 నియోజకవర్గాలకుగాను 3,632 మంది అభ్యర్థులు 5,102 నామినేషన్లు దాఖలు చేశారు. గడిచిన ఎన్నికలతో పోలిస్తే రికార్డు స్థాయిలో నామినేషన్లు దాఖలైనట్లు తెలుస్తోంది. గురువారంతో నామినేషన్లు ముగిశాయి. చివరిరోజు 1619 మంది 1934 నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో 1544మంది పురుషులు 1771 నామినేషన్లు వేశారు. 146మంది మహిళలు 162 నామినేషన్లు దాఖలు చేశారు. ఇతరులు ఒక నామినేషన్ దాఖలు చేశారు. 224 నియోజకవర్గాలకు 3,632 మంది 5102 నామినేషన్లు వేశారు. వీరిలో 3327మంది పురుషులు 4710 నామినేషన్లు దాఖలు చేశారు. 304మంది మహిళలు 391 నామినేష న్లు వేశారు.



అత్యధికంగా బీజేపీ తరపున 707 నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ తరపున 651మంది, జేడీఎస్ తరపున 455, ఆప్ 373, బీఎస్పీ 179, ఎన్పీపీ 5మంది, సీపీఎం 5 నామినేషన్లు దాఖలయ్యాయి. రిజిస్టర్ అయి ప్రాధాన్యత రాజకీయ పార్టీల నుంచి 1007మంది నామినేషన్లు వేయగా, స్వతంత్రులుగా 1720 మంది వేశారు. మొత్తం 5102 నామినేషన్లు దాఖలయ్యాయి. కనకపూర నియోజకవర్గం నుంచి కేపీసీసీ ఛీఫ్ డికే శివకుమార్ నామినేషన్ దాఖలు చేసారు

# భాగ్యనగరం కోటి దాటేసింది

**హైదరాబాద్:**

భారతదేశంలో అత్యధిక జనాభా కలిగిన మొదటి 10 నగరాలలో హైదరాబాద్ చోటు దక్కించుకుంది. దేశంలో అత్యధిక జనాభా కలిగిన నగరాల్లో హైదరాబాద్ 6వ స్థానంలో నిలవగా.. ప్రపంచంలో 34వ స్థానంలో నిలిచింది. పట్టణీకరణ పెరగడంతో తెలంగాణ జనాభాలో మూడోవంతు హైదరాబాద్ లోని నివసిస్తుంది. 1950లో హైదరాబాద్ జనాభా 10 లక్షలు. ఆ తర్వాత1975 నాటికి 20 లక్షలకు పైగా జనాభా ఉంది. 1990లో 40 లక్షలకుపైగా చేరింది. 2010 నాటికి హైదరాబాద్ జనాభా 80 లక్షలకు పెరిగింది. గతంలో ఒకప్పుడు హైదరాబాద్ అంటే ఎంసీహెచ్ పరిధిలోని 170 చదరపు కిలోమీటర్ల పరిధి మాత్రమే. జీహెచ్ఎంసీ ఏర్పాటుతో 650 చదరపు కిలో మీటర్ల పరిధికి విస్తరించింది. అవుటర్ రింగ్‌రోడ్డు వరకు పరిగణనలోకి తీసుకుంటే 1000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం అవుతుంది. ప్రతీ ఏడాది 5 లక్షల మంది ఉద్యోగ, ఉపాధి కోసం హైదరాబాద్ కు వలస వస్తున్నారు. 1591లో హైదరాబాద్ ను ముహమ్మద్ కులీ కుతుబ్ షా నిర్మించాడు. 1956 నుంచి 2014 వరకు ఉమ్మడి ఏపీ రాజధానిగా హైదరాబాద్.. 2014 నుంచి హైదరాబాద్ తెలంగాణ రాజధానిగా కొనసాగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్ జనాభాలో 64.93 శాతం హిందువులు, 30.13 శాతం ముస్లింలు, 2.75 శాతం క్రైస్తవులు, 2.19 శాతం ఇతర మతాలకు చెందినవారు ఉన్నారు. కోటికి పైగా ఉన్న హైదరాబాద్ జనాభాలో 14 ఏళ్లలోపు పిల్లలు 25 శాతం వరకు ఉన్నారు. 60 శాతం పైగా జనాభా 15 నుంచి 64 ఏళ్ల మధ్యలోని వారే కావడం విశేషం.

prajathapana.com

## ఘోర రోడ్డు ప్రమాదం

**మైలవరం**

విజయవాడ నుండి హైదరాబాద్ వెళుతున్న బి ఎస్ ఆర్ ట్రావెల్ బస్సు డివైడర్ను ఢీకొని బోల్తా పడింది. గురువారం రాత్రి ఒంటి గంట సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులను స్థానికగా ఉన్న ఆంధ్ర హాస్పిటల్ కి తరలించారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో సుమారు 45 మంది ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

## విద్యుత్ షాక్ తో దంపతులు మృతి

**మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని లైన్ గడ్డ ప్రాంతంలో విషాదం నెలకొంది. ఇంట్లో మోటార్ ద్వారా నీళ్ళు పడుతున్న క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ షాట్ సర్క్యూట్ అవడంతో భార్య భర్తలు మృతి చెందారు. బొల్లంపెల్లి శ్రీనివాస్ (45), బొల్లంపెల్లి శశి దేవి (38) ల మృతితో కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

## లారీని తగలబెట్టిన మావోయిస్టులు

**బీజాపూర్**



చత్తీస్ ఘడ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా లో మావోయిస్టులు తెగబడ్డారు. ఐరన్ ఓర్ కోసం వెళ్తున్న లారీని తగల పెట్టారు. నారాయణపూర్ జిల్లా పరస్ గావ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓర్చ వద్ద లారీని దగ్ధం చేసారు. లారీ చోటే డోంగర్ వద్ద ఉన్న ఐరన్ మైన్ కు లోడ్ కోసం వెళ్తున్నప్పుడు మావోయిస్టులు ఆపారు. లారీ డ్రైవర్, క్లీనర్లను దింపివేసి వాహనాన్ని తగలబెట్టారు. జిల్లా ఎస్పీ పుష్కర శర్మ ఘటనను ధ్రువీకరించారు.

## చెర్వుగట్టు లో సిబ్బంది చేతివాటం

**నల్గొండ**

నల్లగొండ జిల్లా పరిధిలోని, చెర్వుగట్టు దేవస్థానములో కొందరి ప్రైవేట్ ఉద్యోగుల చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ప్రతినెల అమావాస్య సందర్భంగా చెరువుగట్టుకు భక్తులు పోటెత్తుతుంటారు. ఈ రద్దీ రోజుల్లో ముడుగుండ్ల దర్శనానికి వెళ్లే భక్తులకు 10రూ, 50రూ టికెట్స్ తీసుకొని వెళుతుంటారు. ఇదే అదునుగా భావించిన కొంతమంది ప్రైవేటు ఉద్యోగులు, దళారులు.. దేవస్థానం పేరిట నకిలి టికెట్ బుక్స్ ని ముద్రించి భక్తులకు విక్రయం చేస్తున్నారు. ప్రతి అమావాస్య రోజున 8 నుంచి 10 వేల టికెట్లు అమ్ముడు పోతుంటాయి. ఈసారి మాత్రం.. కేవలం 3వేల టికెట్ల అమ్మకం జరగడంతో ఈవో నవీన్ ఫోకస్ పెట్టారు. దీంతో నకిలీ కేటుగాళ్లు, దళారుల దందా వ్యవహారం బయటపడింది. రెడ్ హ్యాండెడ్ గా నకిలీ టికెట్ల ను అమ్ముతుండగ పట్టుకున్న ఇంచార్జి ఈఓ నవీన్, అక్కడ విధులు నిర్వహిస్తున్న 8మందికి స్ధాన చలనం చేసి వారిపై విచారణకు ఆదేశలు జారీ చేశారు. దేవస్థానం ఆదాయానికి గండి కొడుతున్న ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తుల డిమాండ్ చేస్తున్నారు. సాధారంగా ప్రతి అమావాస్య కు 10వేలకు పైగా దర్శన టికెట్స్ అమ్ముడు పోతాయి, కానీ గత అమావాస్య నుంచి కేవలం 3వేల టికెట్స్ అమ్ముడు పోయినట్లు చూపించడంలో ఈఓ కి అనుమానం వచ్చింది.

## శ్రీవారిని దర్శించుకున్న మంత్రి

**తిరుమల:**

రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ, సినిమాటోగ్రఫీ మరియు వెనుక బడిన తరగతుల శాఖా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ తిరుమల శ్రీవారిని శుక్రవారం ప్రాతః కాల సమయంలో అభిషేక సేవలో సేవించి దర్శించుకున్నారు. శ్రీవారి దర్శన అనంతరం మంత్రి రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుగు పయనం అయ్యారు.

## వెంకయ్యను కలిసిన జేడీ లక్ష్మీనారాయణ

**విశాఖ**

భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడును సిబిఐ మాజీ జేడీ లక్ష్మీ నారాయణ కలిశారు. విశాఖలో శుక్రవారం ఉదయం బీచ్ రోడ్డులో ఇరువురు కలిసి, కాసేపు ముచ్చటించారు. విశాఖ ఉక్కు ఉద్యమంపై తమ కార్యాచరణను జేడీ లక్ష్మీనారాయణ వెంకయ్య నాయుడుకు వివరించారు.

## నలుగురుపై సస్పెన్షన్ వేటు

**సీతంపేట**

మన్యంలో పర్యటిస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ నలుగురు విద్యాశాఖ అధికారులపై సస్పెన్షన్ వేటు వేశారు. వీరఘట్టం మండలంలోని రేగులపాడు కేజీబీవీ సందర్శించిన సమయంలో అక్కడ విద్యా సంవత్సరం ఆఖరి వరకు పుస్తకాలు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మన్యం జిల్లా డీఈవో ఎస్ డి వి రమణ, కేజీబీవీ ప్రిన్సిపాల్ రోహిణి. వీరఘట్టం ఎంఈఓ పి కృష్ణమూర్తి. అసిస్టెంట్ జి సి డి ఓ రోజా రమణి లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు

# జీతాలు ఆలస్యం... పెనాల్టీలు వద్దు

**విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు తాము రుణాలు తీసుకున్న బ్యాంక్ మేనేజర్లను కలిసి తమపై పెనాల్టీలు వేయవద్దని కోరుతున్నారు. తమకు జీతాలు ఆలస్యం అవుతున్నాయని అందుకే ఈఎంఐలు సమయానికి కట్టలేకపోతున్నామని చెబుతున్నారు. ఏపీ జేఏసీ అమరావతి మలిదశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు ప్రతీ నెలా ఆలస్యంగా ఇస్తున్నందుకు నిరసనగా బ్యాంకర్లను కలిసి చెల్లింపులపై ఒత్తిడి చేయవద్దని, పెనాల్టిలను వేయవద్దని కోరుతూ ప్రధాన బ్యాంకుల సందర్శన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెల ఒకటో తేదీ జీతం రాకపోవడంతో బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న ఉద్యోగులను డిఫాల్ట్ లిస్టులో పెట్టడంతో వారికి భవిష్యత్తులో తిరిగి రుణాలు తీసుకునే అవకాశం కోల్పోతున్నారని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు నెలలో జీతం ఏ రోజు వస్తుందో తెలియని గందరగోళ పరిస్థితుల్లో ఉన్నామని బ్యాంకు మేనేజర్లు ప్రభుత్వ ఉద్యోగులపై దయఉంచి వారు తీసుకున్న రుణాలకు ఈఎంఐలు కట్ చేయకూడదని బ్యాంకు మేనేజర్లకు వినతిపత్రాలు అందించామని చెబుతున్నారు.తమది ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమం కాదని, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్నదని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. సకాలంలో జీతాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని టైంకి జీతాలు అందకపోతే ఉద్యోగుల కుటుంబాలు ఆందోళనలో కూరుకు పోతాయని ఉద్యోగులు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. ఈఎమ్ఐలు చెల్లించని కారణంగా బ్యాంకులు వడ్డీలు వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు రాక ఉద్యోగులు లోన్ యాప్స్‌లో రుణాలు తీసుకుని ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఉద్యోగ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు పెరిగితే సంతోషించాల్సిన స్థితి నుంచి జీతాలు అందితే చాలు అన్న స్థితికి ఉద్యోగులను తెచ్చారని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎందుకు అన్యాయం చేస్తున్నారని ముఖ్యమంత్రిని ఉద్యోగ నేతలు ప్రశ్నిస్తున్నారు. జీతాలు ఒకటో తేదీన ఇవ్వాలని కోరినా మంత్రుల కమిటీ స్పందించలేదని, సీపీయస్ ఉద్యోగుల రూ. 1300 కోట్ల రూపాయల డబ్బులను ఇవ్వాల్సి ఉందని ఏపీ జేఏసీ నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు చెబుతున్నారు. ఏప్రిల్ నుంచి జీపీఎస్ కు సంబంధించిన ఉద్యోగులకు సమాచారం రావడం లేదని, ప్రభుత్వం నెలాఖరులోగా ఇస్తామని చెప్పినా ఉద్యోగులకు నమ్మకం లేకుండాపోయిందని అన్నారు.సిపిఎస్ రద్దు అంటుంటే జిపిఎస్ అంటున్నారని, పాత పెన్షన్ తప్ప ఇతర ఏది తీసుకువచ్చిన మేము అంగీకరించేది లేదని తెగేసి చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేస్తామని, హామీ ఇచ్చారని, అయితే ఆ హామీని అమలు చేయాలని అడుగుతుంటే స్పందన లేకుండాపోయిందని బొప్పరాజు మండిపడ్డారు.

# నెల్లూరు వైసీపీలో ఆరని మంటలు

**నెల్లూరు:**

నెల్లూరు జిల్లా వైసీపీ నేతల మధ్య విభేదాలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. ఇప్పటికే ముగ్గరు ఎమ్మెల్యేలు పార్టీని వీడారు. ఈ టైంలో మిగతా నేతల మధ్య ఐకృత పెరగాల్సింది పోయి? కలహాలు మరింత ఎక్కువ అయ్యాయట. ప్రధానంగా నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ వ్యవహార శైలిపై పలువురు నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నిర్వహించే సమావేశాలకు అనిల్ కుమార్ యాదవ్ హాజరు కావడంలేదట. అటు అనిల్‌కు బాబాయ్ వరుసయ్యే రూప్ కుమార్ యాదవ్ ఆయనతో విభేదించి ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. ఎమ్మెల్యేతో సంబంధం లేకుండా ఆయన సొంతంగానే కార్య క్రమాలు నిర్వహిస్తున్నారట. అనిల్ కుమార్ యాదవ్ వ్యవహార శైలిపై మంత్రి కాకాణి..ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి?జిల్లా పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సీఎం జగన్‌కు ఫిర్యాదు చేశారట.నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రాంనారాయణ రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి ఇటీవల పార్టీకి దూరమయ్యారు. అదే టైంలో పార్టీ కీలక నాయకుల మధ్య విభేదాలు పెరిగిపోతున్నాయి. రూరల్ పరిధిలోని అల్లిపురం దగ్గర అనిల్ అనుచరుడు లే ఔట్ వేశారు. నీటిపారుదల శాఖకు చెందిన స్థలాన్ని ఆక్రమించి అందులో కలిపేశారనే ఆరోపణలు ఉన్నాయి. అలాంటి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనిల్ మద్దతిస్తున్నారన్నది లోకల్ టాక్. నెల్లూరు రూరల్ పరిధిలోనే ఉన్న కొత్తూరు అంబాపురం వద్ద ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకున్నారు. ఆ విషయం లో అనిల్ అనవసరంగా జోక్యం చేసుకున్నారని దళిత సంఘాలు విమర్శిస్తున్నాయి. రూరల్ నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్తగా ఆదాల ప్రభాకర్ రెడ్డి ఉన్నారు. ఆయనతో సంప్రదించకుండానే అన్ని వ్యవహారాల్లో అనిల్ జోక్యం చేసుకుంటున్నారట. ఈ విషయాన్ని ఆదాల మంత్రి కాకాణి దృష్టికి తీసుకెళ్ళారట.మరోవైపు?ఇటీవల జిల్లా పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో మంత్రి కాకాణి సమావేశమయ్యారు. అదే సమయంలో హైదరాబాదులో ఉన్న ఆదాల ప్రభాకర్ రెడ్డిని హుటాహుటిన నెల్లూరు పిలిపించారట. ఆ సమావేశంలో అనిల్ కుమార్ వ్యవహార శైలిపైనే ప్రధాన చర్చ జరిగిందట. సమన్వయం కోసం సీఎం జగన్ త్వరలోనే జిల్లా పార్టీ నేతలతో సమావేశం నిర్వహించ బోతున్నారట. ఎన్నికలు దగ్గర పడుతున్న టైంలో కీలకమైన జిల్లాలో ఈ పరిస్థితి ఏంటని వైసీపీ అగ్రనాయకత్వం కూడా ఆగ్రహంతో ఉందట. నేతలు కలిసికట్టుగా పనిచేయకపోతే పార్టీ తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది గనుక జరగబోయే సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. జగన్‌తో మీటింగ్ తర్వాతైనా? నెల్లూరు నేతల మధ్య విభేదాలు తొలగుతాయో లేదో చూడాల్సిందే.

# తగ్గనున్న ఎండలు... ఉపశమనం

**హైదరాబాద్ :**



ద్రోణి గాలిలోని అనిచ్చితి తెలంగాణ నుండి రాయలసీమ మీదగా దక్షిణ తమిళనాడు వరకు సగటు సముద్ర మట్టంకి 0.9 కి మీ ఎత్తు వద్ద కొనసాగుతుందని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాగల మూడు రోజులు తెలంగాణ రాష్ట్రంలో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ వచ్చే అవకాశం ఉంది. ఈ రోజు రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు 40 నుండి 42 డిగ్రీల సెంటీగ్రేడ్ మధ్యన అనేక చోట్ల మరియు రేపు 40 డిగ్రీల కన్నా ఎక్కువ అక్కడక్కడ నమోదు అయ్యే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రములో ఉరుములు మెరుపులతో పాటు ఈదురు గాలులు ( గాలి గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో) అక్కడక్కడ వీచే అవకాశం ఉంది. రేపు, ఎల్లుండి ఉరుములు మరియు మెరుపులతో కూడిన వర్షములు అక్కడక్కడ వచ్చే అవకాశం ఉంది.రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుండి 44 డిగ్రీల సెంటీగ్రేడ్ మధ్యన అనేక చోట్ల, రేపు 40 డిగ్రీల నుండి 42 డిగ్రీలు దకొన్ని చోట్ల నమోదు అయ్యే అవకాశం ఉంది. తెలంగాణ వ్యాప్తంగా హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాలు మినహా అన్ని జిల్లాల్లోనూ ఎండల విషయంలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. 21వ తేదీ నుండి 4, 5 రోజుల పాటు తెలంగాణ రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు, గణనీయంగా తగ్గి అనేక చోట్ల 40 డిగ్రీల కన్నా తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఉఊఓఅ పరిధిలో 21 వ తేదీ నుండి 35 డిగ్రీల నుండి 37 డిగ్రీల మధ్య నమోదు అయ్యే అవకాశం ఉంది. ఈరోజు, వాయువ్య తెలంగాణ, రేపు తూర్పు తెలంగాణ జిల్లాలలో, ఉరుములు మెరుపులతో పాటు ఈదురు గాలులువీచే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు.నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో గరిష్ఠంగా 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 11 జిల్లాల్లో 44 డిగ్రీలపైన నమోదయ్యాయి. గ్రామాల్లో ప్రజలు బయటికి రావాలంటే భయపడ్డారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు కొంత ఉపశమనం లభించవచ్చని, ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలలోపే నమోదుకు అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. "హైదరాబాద్ లో ఆకాశం పాక్షికంగా మేఘాలు పట్టి ఉంటుంది. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా 38 డిగ్రీలు, 26 డిగ్రీలుగా ఉండే అవకాశం ఉంది. ఆగ్నేయ దిశ నుంచి గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉంది" అని వెదర్ బులెటిన్ లో పేర్కొ?న్నారు. నిన్న గరిష్ఠ ఉష్ణోగ్రత 39.4 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 27 డిగ్రీలుగా నమోదైంది. గాలిలో తేమ 40 శాతం నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు దక్షిణ కోస్తా ప్రాంతాల్లో కూడా వేడిగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ అధికారులు ఒక ప్రకటనలో తెలిపింది. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు హీట్ వేవ్ హెచ్చరికలను జారీ చేశారు. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలు, రాయలసీమ ప్రాంతంలో 38 నుంచి 42 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంటుందని అంచనా వేశారు.

## ఇటుక బట్టీ కార్మికులపై దాడులు

**యాదాద్రి**

యాదాద్రి జిల్లాలో ఇటుక బట్టీల మాఫియా రెచ్చిపోతున్నారు. కార్మికులను నిర్బంధించి, బెదిరించి వెట్టి చాకరీ చేయిస్తున్న వైనం బయటపడింది. యజమానుల వేధింపులు తాళలేక వలస కార్మికులు పారిపోతున్నారు. పారిపోతున్నలవారిని పట్టుకుని బంధించి, విచక్షణా రహితంగా దాడులకు దిగుతున్నారు. తాజాగా భూదాన్ పోచంపల్లి లో ఘటన వెలుగు చూసింది. పీవీసీ ఇటుక బట్టి యజమాని వెంకట కిరణ్ ఒడిషా కార్మికులపై రాడ్లు, వైర్లతో దాడులు చేయించిన వీడియో తీసి బాధితులు ఒడిషా లేబర్ కమీషన్ కు ఫిర్యాదు చేసారు. ఒడిషా అధికారులు తెలంగాణ ప్రభుత్వానికి సమాచారం అందించారు. దాంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు -స్పందించి కార్మికులను కాపాడారు. తరువాత బాధితులను ను స్వరాష్ట్రానికి కి పంపించారు. ఇటుక బట్టీల్లో చిన్నపిల్లలతోనూ వెట్టి చాకిరీ చేయిస్తారన్న గతం నుంచి అనేక ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే.

## సాయేష్ మృతిపట్ల మంత్రి వనిత సంతాపం

**అమరావతి**

అమెరికాలో దుండగుల చేతిలో హత్యకు గురైన వీర సాయేష్ మృతి పట్ల రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితగ్ర్భాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సాయేష్ మృతదేహాన్ని స్వస్థలం తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశం ఇచ్చామని అన్నారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన వెళ్లిన సాయెష్ స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు..

## బాలుడి హత్యలో దోషులను కఠినంగా శిక్షిస్తాం

**హైదరాబాద్**

సనత్ నగర్ లోని అల్లా ఉద్దీన్ కోటి లో దారుణ హత్యకు గురైన బాలుడు వాహిద్ (8) కుటుంబ సభ్యులను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం పరామర్శించారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ముక్కు పచ్చలు ఆరని చిన్నారి బాలుడి మృతి చాలా బాధాకరం. పవిత్ర రంజాన్ సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న బాలుడిని హత్య చేయడం దుర్మార్గపు చర్య. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటాం. దోషులను కఠినంగా శిక్షిస్తామని అన్నారు

## బాలుడిని హతమార్చిన హిజ్రా

**హైదరాబాద్**



సనత్ నగర్ లో దారుణం జరిగింది. ముస్లీంలు పవిత్రంగా భావించే రంజాన్ నెల, అందునా అమావాస్య రోజున అబ్దుల్ వాహిద్ (8) మృతి కలకలం రేపింది. బాలుని ఓ హిజ్రా బలి ఇచ్చినట్లుగా స్థానికులు ఆరోపించారు. సదరు హిజ్రా ఇంటిపై దాడి చేసారు. సనత్ నగర్ లోని అల్లాదున్ కోటి ఏరియాలో ఘటన జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారి హిజ్రా ఇంటిని ధ్వంసం చేసారు. బాలుని మృదేహాన్ని సమీపంలోని నాలాలో గుర్తించారు. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

మృతి చెందిన బాలుడి మామా కు ట్రాన్స్ జండర్ చిట్టి డబ్బులు ఇవ్వాల్సి ఉంది. డబ్బు లు గొడవ తో బెదిరించాడనికి బాలుడిని చున్నీతో గొంతు నులిమి హత్యచేసిందని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహం స్వాధీనం చేసుకున్న పోలీసులు, థార్డ్ జండర్ ను అదుపు లో తీసుకు విచారిస్తున్నారు. నరబలి కాదు హత్య అంటున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఇరు వర్గాలు మైనారిటీలే.

## గన్నవరం నుంచి దమ్మున్నోడిని నిలబెడతాం

**గన్నవరం**

గన్నవరం నియోజకవర్గం నుంచి డబ్బున్నోడిని కాదు దమ్మున్నోడిని నిలబెడతామని టిడిపి సీనియర్ నేత చింతమనేని అన్నారు. గన్నవరం నియోజకవర్గం సీటు కోసం ఒక వ్యక్తి 150 కోట్లు కోట్లు ఖర్చు పెడతానంటూ తన దగ్గరికి వచ్చినట్లు అయన అన్నారు. అయితే, గన్నవరం సీటు కోసం 150 కోట్లు ఖర్చు పెడతానని తనను కలిసిన వ్యక్తి పేరు చెప్పలేదు. ఓట్లు ఖర్చుపెట్టే వ్యక్తిని కాదు మీసం మేలేసే దమ్మున్న వ్యక్తిని బరిలోకి దింపుతాం. ఒకరు పోతే 100 మంది వస్తారని ఎమ్మెల్యే వల్లభనేని వంశీని ఉద్దేశించి అయన వ్యాఖ్యలు చేసారు.

## ఎమ్మెల్యే మొండితోక కు నిరసన సెగ

**వీరులపాడు**

ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావుకు మరోసారి గడప గడపలో నిరసన సెగ తగిలింది. వీరులపాడు మండలం అల్లూరు గ్రామంలో గడప గడపకు తిరుగుతున్న ఎమ్మెల్యే మొండితోకను డ్రైనేజీ సమస్య, ఫీజ్ రియంబర్స్మెంట్ రావడం లేదని ఒక విద్యార్థి నిలదీసాడు. దాంతో ఎమ్మెల్యే సహనం కోల్పోయారు. పక్కనే వున్న వైకాపా నేతలు రమేష్ ,ముత్తారెడ్డి కలగచేసుకునొ ఆ విద్యార్థిని ఎమ్మెల్యే నే ప్రశ్నిస్తావా ,నీకు పథకాలు ఎలా వస్తాయి అసలు ఎలా తిరుగుతావు అని బెదిరించారు. మొన్న పరిటాల,నిన్న కొడవటికల్లు ఇవాళ అల్లూరు ఇలా ప్రతి మండలంలో ప్రతి గ్రామంలో అయనకు నిరసన సెగ తగులుతోంది.

ప్రజా తపన
prajathapana.com

# కాంగ్రెస్ నేతల మధ్య టికెట్ వార్

**నిజామాబాద్ :**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ లో అప్పుడే నేతల మధ్య టికెట్ వార్ రాజుకుంటోంది. ఇంకా ఎన్నికలకు 6 నెలలు సమయం ఉంది. అయితే నియోజకవర్గాల్లో నేతలు తమకంటే టికెట్ తమకే వస్తుందని చెప్పుకుంటున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 9 నియోజకవర్గాలున్నాయి. గత కొంత కాలం నుంచి ఆయా నియోజకవర్గాల్లో టికెట్ ఆశిస్తున్న నేతలు క్యాడర్ తో టచ్ లో ఉంటున్నారు. ఎవరికి వారే టికెట్ తమకే వస్తుందంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీంతో కాంగ్రెస్ లో వర్గ పోరు మొదలైంది. ప్రధానంగా నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, ఎల్లారెడ్డి, జుక్కల్ , బాన్సువాడ ఈ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుల్లో టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువవుతోంది. నిజామాబాద్ అర్బన్ విషయానికి వస్తే గత ఎన్నికల్లో అర్బన్ టి?కెట్ తాహెర్ బిన్ హందాన్ వచ్చింది. తాహెర్ బిన్ గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అయితే ఈ సారి కూడా టికెట్ తనకే వస్తుందని తాహెర్ అనుచరులు చెప్పుకుంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ సిటీ ప్రెసిడెంట్ కేశ వేణు సైతం టికెట్ పై ఆశలు పెట్టుకున్నారు. ఈ సారి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి టికెట్ తనకే వస్తుందన్న ధీమాతో కేశవేణు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇటీవలే కాంగ్రెస్ లో చేరిన మాజీ పీసీసీ అధ్యక్షుడు డీఎస్ తనయుడు సంజయ్ కూడా అర్బన్ నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న లిస్టులో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. అటు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ సైతం అర్బన్ టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి డాక్టర్ భూపతి రెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. ఈ సారి భూపతి రెడ్డికే టికెట్ వరిస్తుందన్న ఆశాభావంలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే రూరల్ నియోజకవర్గానికి చెందిన మరో నేత నగేష్ రెడ్డి కూడా కాంగ్రెస్ టికెట్ రేసులో ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. నగేష్ రెడ్డి కూడా చాలా కాలం నుంచి కాంగ్రెస్ పార్టీలోనే ఉంటున్నారు. ఈయన కాంగ్రెస్ హయాంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ గా కూడా పనిచేశారు. ఈ ఇద్దరు నేతలు పోటాపోటీగా రూరల్ నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు చేస్తున్నారు. టికెట్ నాకంటే నాకే వస్తుందన్న ధీమాలో ఆ ఇద్దరు నేతలు ఉన్నట్లు సమాచారం. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి రూరల్ లో పాదయాత్ర చేస్తున్న సమయంలోనూ ఈ ఇద్దరు నేతలు ఎవరికి వారే కార్యక్రమాలు నిర్వహించారు. బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ లోనూ వచ్చే ఎన్నికల్లో టికెట్ ఆశిస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. గత ఎన్నికల్లో బాల్కొండ నుంచి ఈరవత్రి అనిల్ కూమార్ కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఈ సారి కూడా బాల్కొండ నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న వారిలో అనిల్ ఉన్నట్లు తెలుస్తోంది. వైఎస్ ప్రభుత్వంలో అనిల్ విప్ గా వ్యవహరించారు. మరోవైపు నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి కూడా బాల్కొండ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ రేస్ లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇంకోవైపు గత ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ చేసిన ఆరెంజ్ ట్రావెల్స్ ఓనర్ సునీల్ రెడ్డి సైతం కాంగ్రెస్ పార్టీలో చేరితే టికెట్ ఆశించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే సునీల్ రెడ్డి టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డితో టచ్ లో ఉన్నారన్న ప్రచారం కూడా జరుగుతోంది. ఇక ఎల్లారెడ్డి నియోజకవర్గంపై ఇటు మాజీ మంత్రి షబ్బీర్ అలీ కొడుకు ఇలియాస్ కూడా కన్నేశారన్న ప్రచారం జరుగుతోంది. గత ఎన్నికల్లో ఎల్లారెడ్డి నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలిచిన జాజుల సురేంధర్ అనంతరం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. దీంతో ఈ నియోజకవర్గంపై సుభాష్ రెడ్డి సైతం టికెట్ ఆశిస్తున్న వారిలో ఉన్నారు. అయితే గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి జహీరాబాద్ ఎంపీగా పోటీ చేసిన మధన్ మోహన్ రావు తక్కువ మెజార్టీతో ఓడిపోయారు. మదన్ మోహన్ రావు సైతం ఎల్లారెడ్డి టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇటు షబ్బీర్ అలీకి, మదన్ మోహన్ రావుకు వర్గపోరు నడుస్తోంది. ఈ నియోజకవర్గంపై ముగ్గురు నేతలు కన్నేశారు. ఈ ముగ్గురు తమకంటే తమకే టికెట్ వస్తుందన్న ఆశాభావంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక బాన్సువాడ నుంచి గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి కాసుల బాలరాజు పోటీ చేసి ప్రస్తుత స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి మీద ఓడిపోయారు. ఇప్పటికి నాలుగు సార్లు కాసుల బాలరాజు బాన్సువాడ బరిలో దిగి నాలుగు ఓటమి పాలయ్యారు. ఈ సారి కూడా కాంగ్రెస్ టికెట్ తనకే అంటూ ధీమాలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఓ ఎన్నారై సైతం బాన్సువాడ కాంగ్రెస్ టికెట్ మీద కన్నేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికలు వచ్చే సమయానికి తెరపైకి కాంగ్రెస్ నుంచి కొత్త వ్యక్తిని బరిలో దింపే అవకాశాలు లేకపోలేదనే ప్రచారం కూడా జరుగుతోంది. జుక్కల్ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి సౌధాగర్ గంగారం పోటీ చేసి ఓడిపోయారు. ఈ సారి కూడా టికెట్ తనకే వస్తుందని ఆయన అనుచరు చెప్పుకుంటున్నారు. మరోవైపు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రెండు సార్లు డీసీసీ అధ్యక్షుడిగా చేసిన గడుగు గంగాధర్ గత కొంత కాలంగా జుక్కల్ నియోజకవర్గంలో ఉంటూ తన ప్రాబల్యాన్ని చాటుకుంటున్నారు. ఈ సారి టికెట్ తనకే వస్తుందన్న గట్టి నమ్మకంలో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది. గంగారాం కూడా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత. నాలుగు సార్లు జుక్కల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ ఇద్దరు నాయకులు ఎవరికి వారే పోటా పోటీగా జుక్కల్ నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. టికెట్ తమకంటే తమకే వస్తుందన్న ధీమా వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్న వారి లిస్ట్ పెరుగుతుండటంతో క్యాడర్ కన్ఫ్యూజ్ లో పడుతున్నారు. ఎవరి పిలిస్తే వెళ్లాలి. ఎవరికి టికెట్ వస్తుందో అన్న మీమాంసలో పడుతున్నారు. ఆలూ లేదు చూలూ లేదు అల్లుడు పేరు సోమలింగం అన్నట్లు తయారైంది ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పరిస్థితి అంటూ క్యాడర్ వాపోతున్నారు.

# పచ్చని పంట భూమిలో రక్తం చిందిస్తారు

**మీరే సాక్షి,మీరే న్యాయవాది..**

**అధికార బీజేపీపై విరుచుకుపడ్డ మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ**



**హైదరాబాద్ :**

నరోదాగామ్ ఊచకోత కేసులో కోర్టు తీర్పు నేపథ్యంలో హైదరాబాద్ లోక్ సభ సభ్యుడు, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ తాజాగా సంచలన ట్వీట్ చేశారు. అహ్మదాబాద్‌లోని ప్రత్యేక కోర్టు గురువారం బీజేపీ మాజీ ఎమ్మెల్యే మాయా కొద్నానీ, భజరంగ్‌దళ్ మాజీ నాయకుడు బాబు భజరంగి సహా మొత్తం 67 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటించింది.నరోదా పాటియా ఊచకోత కేసులోమొత్తం 67 మంది నిందితులను నిర్దోషులుగా విడుదల చేయడంపై అసదుద్దీన్ స్పందించారు.మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ దివంగత కవి రహత్ ఇండోరి కవితను ఉటంకిస్తూ గుజరాత్‌లోని అధికార బీజేపీపై విరుచుకుపడ్డారు. “మీరు వెళ్లి నిప్పు పెడతారు, మీరు ఎక్కడికి వెళ్లినా గందరగోళాన్ని సృష్టిస్తారు...పచ్చని పంట భూమిలో రక్తం చిందించే హక్కు రాజకీయాలు మీకు కల్పించాయి. మీరు అప్పీలు చేస్తారు, మీరు కేసు వాదిస్తారు, మీరే సాక్షి,మీరే న్యాయవాది. ఎవరినైనా చెడుగా మాట్లాడే స్వేచ్ఛ మీకు ఉంది, ఎవరినైనా చంపడానికి మీకు స్వేచ్ఛ ఉంది”అని అహ్మదాబాద్‌లోని ప్రత్యేక కోర్టు నిర్దోషులుగా ప్రకటించిన కొన్ని గంటల తర్వాత ఒవైసీ ట్వీట్ చేశారు.

# విద్యుత్ షాక్ తో భార్యభర్తలు మృతి

**మంచిర్యాల**

ఆ కుటుంబానికి కరెంటు షాక్ తగిలింది.. విద్యుత్తు షాక్ తగిలి భార్యభర్తలు ఇద్దరు మృత్యువాత పడటంతో.. చెన్నూర్లో పట్టణంలోని లైన్ గడ్డ ప్రాంతంలో విషాదం చోటు చేసుకుంది. ఇంట్లో మోటార్ ఆన్ చేసి.. ఇంటికి నీళ్ళు పడుతున్న క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ షాట్ సర్క్యూట్ అయింది. దీంతో బొల్లంపెల్లి శ్రీనివాస్ (45) బొల్లంపెల్లి శశి దేవి (38) భార్య భర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలో స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు శ్రీనివాస్. చెన్నూర్ లైన్ గడ్డలో ఆయన కొత్త ఇల్లు నిర్మాణం చేస్తున్నారు. తన నివాస ప్రాంతంలో వాటర్ ప్లాంటు కూడా నిర్వహిస్తారు. గురువారం రాత్రి గాలి, దుమారంతో ఇంటి వద్ద అంతా చెత్త పడింది. దీనిని శుభ్రం చేసేందుకు శ్రీనివాస్ భార్య శశిదేవి పైపుతో నీరు పడుతూ శుభ్రం చేస్తోంది. ఈ క్రమంలో వైరు తెగి.. వర్షానికి, తడికి షాట్ సర్క్యూట్ కావటంతో ఆమెకు కరెంటు షాక్ తగిలింది. ఆమెను కాపాడేందుకు వెళ్లిన భర్త శ్రీనివాస్ కూడా విద్యుత్ షాక్ తో మృత్యువాత పడ్డారు. అందరితో కలుపుగోలుగా.. కాలనీ వాసులతో కలివిడిగా ఉండే ఆయన మృతితో ఆ కుటుంబంతో పాటు కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

# టీ కాంగ్రెస్ లో ఎవరికి వారే..యమునా తీరే

**హైదరాబాద్ :**

కాంగ్రెస్ ను కాంగ్రెస్సే ఓడించుకుంటుంది అనే సెటైర్ ఆ పార్టీపై ఉంటుంది. ఎంతకు దిగజారిపోయినా ఆ సెటైర్ ఎప్పటికప్పుడు నిజం అవుతూనే ఉంది. ముందు ఎన్నికల్లో గెలిస్తే ఆ తర్వాత పదవులు వస్తాయి. అప్పుడు పదవుల కోసం కొట్లాడుకోవచ్చు. అసలు ఇంకా ఎన్నికల్లో గెలవకుండానే.. గెలుస్తారన్న పెద్దగా ఆశలు లేకుండానే పదవుల కోసం కొట్లాడటం కాంగ్రెస్ నేతలకే చెల్లింది. నేనే సీఎం అవుతా అని రేవంత్ రెడ్డి పరోక్షంగా చెబుతూంటే.. నాకేం తక్కువ భట్టి విక్రమార్క ప్రశ్నిస్తున్నారు. వారిద్దరేనా ఇంకా బయటపడని చాలా మంది సీనియర్లు.. తాము మాత్రం తీసిపోయామా అని అనుకుంటూ ఉంటారు. వీరంతా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని ప్రజల్లో మరో విధంగా చర్చకు పెడుతున్నారు. మల్లు భట్టి విక్రమార్క సీఎల్పీ లీడర్. అధికారికంగా ఆయనకు ఆ పదవి లేదు. ఎమ్మెల్యేలంతా బీఆర్ఎస్‌లో చేరిపిపోవడంతో మిగిలి ఉన్న నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు లీడర్ ఆయన. ప్రస్తుతం పాదయాత్ర చేస్తున్నారు. ఈ పాదయాత్ర ద్వారా తాను మరో వైఎస్‌ను అయ్యానని ఆయన ఊహించుకుంటున్నారు. సీఎం పదవి పొందడానికి తనకేం తక్కువని ఆయన ప్రశ్నిస్తున్నారు. హైకమాండ్ చాన్సిస్తే ముఖ్యమంత్రిని అవుతానని చెబుతున్నారు. ఇందిరమ్మరాజ్యం తెస్తానని శపథం చేస్తున్నారు. మల్లు భట్టి విక్రమార్క ప్రకటనలు కాంగ్రెస్‌లో ఖచ్చితంగా కాక రేపేవే. అందులో సందేహం లేదు. ఎందకంటే కాంగ్రెస్ చాలా మంది నేతలు తమది కూడా సీఎం రేంజ్ అని అనుకుంటూ ఉంటారు. అలాంటి భట్టి విక్రమార్క బహిరంగంగా చెబితే ఊరుకుంటారా ?టీ పీసీసీ చీఫ్ గా రేవంత్ రెడ్డి ఉన్నారు. సహజంగా కాంగ్రెస్ పార్టీ గెలిస్తే ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడ్ని సీఎంను చేస్తారు. ఎన్నికల్లో కష్టపడిన విధానం.. ప్రజల్లో ఉన్న పలుకుబడి వంటివి లెక్కలేసుకుని ఈ పదవిని హైకమాండ్ కేటాయిస్తుంది. ఇవన్నీ తనకు పుష్కలంగా ఉన్నాయని .. కాంగ్రెస్ పార్టీని తాను గెలిపిస్తానని తానే సీఎం అవుతానని రేవంత్ రెడ్డి నమ్మకంతో ఉన్నారు. అయితే సీఎం పదవిగురించి ఆయన ఎక్కడా బహిరంగంగా చెప్పడం లేదు. మాట్లాడటం లేదు. మీడియా చిట్ చాట్‌లలో తన మనసులో మాట పరోక్షంగా చెబుతున్నారు. ప్రస్తుతానికి తన దృష్టి అంతా కాంగ్రెస్ ను గెలిపించడంపైనే ఉందని చెబుతున్నారు. రేవంత్ రెడ్డి మాస్ లీడర్. టీ పీసీసీ చీఫ్ గా కూడా ఉన్నారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ గెలిస్తే ఆయనే సీఎం అవుతారన్న అంచనాలు ఉన్నాయి. అయితే ఆయనను సీఎం కాకుండా చేయడానికి సీనియర్లు చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. దళిత సీఎం అనే వాదన కూడా తీసుకు వచ్చారు. అంతర్గత రాజకీయాలు కూడా ఎక్కువగా ఉన్నాయి. తామంతా కష్టపడి ఆయనను ఎందుకు సీఎం చేయాలని కోమిటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విమర్శలు చేసి పార్టీ నుంచి వెళ్లిపోయారు. ఆయన సోదరుడు మాత్రం కాంగ్రెస్ లో ఉన్నారు కానీ ఆయనదీ అదే అభిప్రాయం అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీకి ఎడ్జ్ ఉందని పలు సర్వేలు చెబుతున్నాయి. అక్కడి నేతలు సీఎం పదవి కోసం పోటీ పడటం సహజమే. కానీ తెలంగాణలో కాంగ్రెస్ గెలుస్తుందని ఏ ఒక్క సర్వే చెప్పడం లేదు. ఇలాంటి సమయంలో కష్టపడి పార్టీని బలోపేతం చేసి.. గెలిపించాలని ఎవరైనా ఆలోచిస్తారు. ఎందుకంటే గెలిస్తేనే పదవుల రేస్ ఉంటుంది. ఓడిపోతే రాజకీయ భవిష్యత్ క్లోజ్ అవుతుంది. కానీ ఈ విషయాలను కాంగ్రెస్ నేతలు పట్టించుకోవడం లేదు. తాము సీఎం అయితేనే కాంగ్రెస్ గెలవాలన్నట్లుగా వారి తీరు ఉంది. హైకమాండ్ కూడా సర్దుబాటు చేయలేకపోతోంది.

# విజిలెన్స్ వలలో ఎమ్మెల్సీ

**తిరుమల**

నగదు తీసుకుని ప్రోటోకాల్ బ్రేక్ దర్శన టిక్కెట్లు ఇస్తున్న ఎమ్మెల్సీ వ్యవహారం టీటీడీ విజిలెన్స్ అధికారులు రట్టు చేసారు. సదరు ఎమ్మెల్సీ అదనపు ఈవో కార్యాలయంలో 14 ప్రోటోకాల్ బ్రేక్ దర్శన టిక్కెట్లకు లెటర్ ఆప్లే చేసారు. అయనకు 10 టికెట్ల మాత్రమే కేటాయించారు. తరచూ దర్శనాలకు, గదులకు సిఫార్సు లేఖలు పంపుతున్న ఎమ్మెల్సీ, ఈ సారి షేక్ షాబ్జీ స్వంతంగా వస్తానని ని చెప్పాడు. ఆరుగురిని శ్రీవారి దర్శనం చేయించడం కోసం లక్షా 5 వేల రూపాయలను భక్తులు ప్రజాప్రతినిధి డ్రైవర్ ఖాతాకు పంపారు. గత నెల రోజుల వ్యవధిలో ప్రజాప్రతినిధి 19 సిఫార్సు లేఖలు జారీ చేశారు. ప్రతి సిఫార్సు లేఖని ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులకే ఇచ్చినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. వ్యవహారం అధికారులకు చేరింది. దాంతో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. మాకు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహిస్తే భక్తుల ఆధార్ ట్యాంపరింగ్ చేసినట్టు తెలిసింది. హైదరాబాద్ అడ్రస్ ఆధార్ లతో దర్శనానికి ఆప్లే చేసారు, కానీ తనిఖీల్లో బెంగుళూరు వారిగా గుర్తించామని అధికారులు వెల్లడించారు. భక్తుల నుండి లక్ష ఐదు వేలు తీసుకున్నట్లు తెలింది. ఎమ్మెల్సీ డ్రైవర్ రాజు అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించాం. ఎమ్మెల్సీ సిఫార్సు లేఖలపై దర్యాప్తు చేస్తున్నామని టీటీడీ విజిలెన్స్ విజీఓ గిరిధర్ రావు వెల్లడించారు.

# తాడేపల్లి ఇంటికి కుడా సిబిఐ నోటీసులు

**మైలవరం**

విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి కాలనీ మక్కా మస్ జిద్ లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ముస్లిం మైనారిటీలకు చంద్రన్న కానుక రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమా పాల్గోన్నారు. దేవినేని మాట్లాడుతూ తాడేపల్లి కొంపకి కూడా కూడా సిబిఐ నోటీసులు వెళ్లాయి. బాబాయిని చంపేసి రాజకీయంగా లబ్ది పొందారు. కోడికత్తి డ్రామాతో పొడిపించుకున్న వాడు ముఖ్యమంత్రి అయ్యాడు పొడిచిన వాడు నాలుగేళ్లుగా జైల్లో మగ్గుతున్నాడు. కదిరి నుంచి గొడ్డలి తెచ్చిన వారికి కోటి రూపాయలు నజరానా బాబాయి మర్డర్ కేసులో 40 కోట్ల సుపారి వుంది. మైలవరం నియోజకవర్గం లో అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యే వసంత 500 కోట్ల గ్రావెల్ దోచేశాడు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో అధికార పార్టీ నేతలు ఎనిమిది వందల కోట్ల మట్టి మాఫియా దందా చేశారు. పోలవరం కాలవ కట్టలను ధ్వంసం చేశారు. నాడు అధికారంలో నా పక్కనుండి మోసం చేసిన దొంగలు నేడు సంచులు వేసుకొని మళ్లీ మోసగించేందుకు బయలుదేరారు. వారి మాయ మాటలకు మోసపోకండి ఏమరపాటుతో ఉండకుండా జాగ్రత్త పడండి ఈ దొంగలకు బుద్ధి చెప్పి తరిమికొట్టాలి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ముస్లిం మైనారిటీల అభివృద్ధి. క్రిస్మస్ సంక్రాంతి రంజాన్ పండుగలకు కానుకలు ఇచ్చి పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామని అన్నారు.

# ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి

**తిరుపతి,**

కేంద్ర ప్రభుత్వ పథకాలు అయిన ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన , ప్రధాన మంత్రి జీవన జ్యోతి గురించి గ్రామ పంచాయతి స్థాయిలో అవగాహన , ప్రచారం కల్పించాలి అని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఆర్ డి ఓ లు, మునిసిపల్ కమిషనర్లు, తాసిల్దారులు, మెడికల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, ఎంఈఓ లు, వెలుగు ఏపీఎంలు, సంబంధిత అధికారులతో ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి, జగనన్నకు చెబుదాం, ఎన్ సీ డి సర్వే, రిథమ్ యాప్ వంటి అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకాల పై అవగాహన కల్పించి ఎన్రోల్మెంట్ చేసేలా సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకము సంబంధించి 18 నుండి 50 సంవత్సరాల వయసు కలిగిన వారికి ప్రతి సంవత్సరము రూ.436 లతో ఆటో డెబిట్ ద్వారా సహజ మరణం పొందిన వ్యక్తి యొక్క నామినీకీ ప్రభుత్వం రెండు లక్షల రూపాయల బీమా అందిస్తుంది. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన సంబంధించి 18 నుండి 70 సంవత్సరములు కలిగిన వారు ఎన్రోల్మెంట్ చేసుకున్న వారికి ఏదైనా ఆకస్మిక ప్రమాదం జరిగిన ఎడల వారి నామినికి రెండు లక్షల రూపాయలు బీమా చెల్లించడం జరుగుతుందని, గ్రామ సచివాలయంలోని పంచాయతీ సెక్రటరీలకు దీనిపై అవగాహన కల్పించి వాలంటీర్ల తో హ్యాబిటేషన్ వారీగా ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి గురించి అవగాహన కల్పించి ఎన్రోల్మెంట్ చేయించేలా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. వాలంటీర్లు ఎన్రోల్మెంట్ చేసే ముందు లబ్ధిదారుల బ్యాంకు ఖాతా నెంబరు, ఆధార్ నెంబర్, నామినీ వివరాలతో అప్లికేషన్స్ పూర్తి చేసేలా చూడాలని అన్నారు. కావున ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ పథకానికి సంబందించి వినూత్న ప్రచారం లో బాగంగా గ్రామ పరిధిలో బ్యానర్లు, పోస్టర్లు, పాంప్లెట్లు అంటించేల బ్యాంకర్లందరికి సూచనలివ్వడం జరిగిందని అన్నారు. గ్రామస్థాయి లో బ్యాంకర్లు, లైన్ డిపార్ట్మెంట్ వారందరూ సహకారంతో అమలు అయ్యేలా కృషిచేయాలని తెలిపారు. నాడు-నేడు, నవరత్నాలు పేదలందరికి ఇళ్ళు, జగనన్న భూ హక్కు- భూ రక్షా పథకం, విలేజ్ హెల్త్ క్లినిక్, గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ పనితీరును పరిశీలి0చేందుకు ప్రత్యేక అధికారుల నియామకాన్ని ప్రభుత్వం చేపట్టిందని, స్పందనకు సంబందించి రాష్ట్ర ముఖ్యమంత్రి వారిచే మే మొదటి వారంలో రివ్యూ ఉంటుందని తెలిపారు. స్పందన లో వచ్చిన అర్జీలను బియాండ్ ఎస్.ఎల్.ఏ లోకి వెళ్లకుండా చూడాలన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలపై ఎండార్స్ మెంట్ క్లియర్ గా వుండాలని అన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన నిర్వహించాలని తెలిపారు. స్పందనకు సంబందించి ప్రతి సచివాలయంలో ప్రత్యేక రిజిస్టర్ మెయింటెయిన్ చేసేలా పంచాయతీ సెక్రటరీ భాద్యతగా చూసుకోవాలన్నారు. ఈ రిజిస్టర్ లో స్పందన లో ఎన్ని ఆర్జీలు వచ్చాయి, ఎన్ని పరిష్కరించబడ్డాయి అనేది నమోదు చేయవలసి ఉంటుంది అన్నారు. ప్రతి మండల స్థాయిలో తాసిల్దారు ఆఫీస్ లో స్పందన కార్యక్రమం నిర్వహించాలి అని తెలిపారు. ప్రతి రోజు స్పందన వెబ్ సైట్ లో లాగిన్ అయ్యి 24 గంటలలోపు వచ్చిన అర్జీలపై రోజుకు ఎన్ని అర్జీలు వస్తున్నాయో పరిశీలన చేసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది హాజరు శాతం పెంచాల్సిన భాద్యత ఏం.పి.డి.ఓ ల పైన ఉందని తెలిపారు. అందరు ఎంపిడిఓ మున్సిపల్ కమిషనర్లు అన్ని సచివాలయాల్ని తనిఖి చేసి రికార్డ్స్ పరిశీలన, ఎన్ని సేవలు అందిస్తున్నాయి అని, ఎన్ని గ్రీవెన్స్ వస్తున్నాయి అనేది సమీక్షించుకోవాలన్నారు.

# ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం-ఎమ్మెల్యే శ్రీదేవి

**తుగ్గలి**

రాష్ట్రంలోని ప్రజల యొక్క సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలియజేశారు. మండల పరిధిలోని గల ఎద్దుల దొడ్డి గ్రామంలో రెండవ రోజు నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని గడపగడపకు వెళ్లి లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాల గురించి వివరించారు. ప్రభుత్వం ఏర్పడిన నాలుగు సంవత్సరాల నుండి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చిందని ఆమె లబ్ధిదారులకు తెలియజేశారు.ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను అందించి ఆర్థిక భరోసాను కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని ఆమె తెలియజేశారు.గ్రామంలో గడపగడపకు పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కొరకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే శ్రీదేవి లబ్ధిదారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్ రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యురాలిగా వేషం..ఉద్యోగాల పేరిట మోసం

**కాకినాడ**



తెల్లకోటు ధరించి, మెడలో స్టెతస్కోప్ వేసుకుని వైద్యురాలిలా కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో తిరుగుతూ ఉద్యోగాలిప్పిస్తానంటూ మోసం చేసిన యువతిని ఒకటో పట్టణ పోలీసులు గురువారం అదుపు లోకి తీసుకున్నారు.కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన సానా అరుణసాయి(24) జీఎన్ఎం కోర్సు పూర్తిచేసింది. ఎక్కడా ఉద్యోగం లభించకపోవడంతో గత డిసెంబరు నుంచి జీజీహెచ్లో ప్రయత్నించింది. అక్కడా ఉద్యోగం లభించలేదు.అనంతరం ఆమె వైద్యురాలి అవతారం ఎత్తింది. రోజూ ఆసుపత్రికి వెళ్తుండేది. ఈ క్రమంలో కాకినాడకు చెందిన ఎస్.మమత, మాధురి పరిచయమయ్యారు. ఖాళీగా ఉన్నామని ఉద్యోగం ఇప్పించాలని వారిద్దరూ ఆమెను కోరారు.
ఇదే అదనుగా తీసుకున్న అరుణసాయి ఆరోగ్య మిత్రలో ఉద్యోగాలు ఇప్పిస్తానని దానికి కొంత ఖర్చవుతుందని చెప్పింది. వారిద్దరూ ఆమెకు పలు దఫాలుగా రూ.47వేలు అందజేశారు. అనంతరం ఉద్యోగాలు రాకపోవడంతో మోసపోయామని గ్రహించి ఇద్దరూ గురువారం జీజీహెచ్కు వెళ్లారు. సెక్యూరిటీగార్డు సహాయంతో నిందితురాలిని పట్టుకుని అవుట్పోస్టు పోలీసులకు అప్పగించారు. అనంతరం ఆమెను వన్టౌన్ పోలీసుస్టేషన్కు తరలించి కేసు నమోదు చేశారు. ఇదే తరహాలో ఇంకా ఎవరినైనా మోసం చేసిందా.. అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం జగన్ పై ఎంపీ రామ్మోహన్ సెటైర్లు

**శ్రీకాకుళం**

చంద్రబాబు చేసిన సంస్కరణలను దేశంలోని కీలక నేతలు ఆచరించారని, మోడల్గా తీసుకున్నారని.. ప్రధానిగా వాజ్పాయ్ సయితం.. చంద్రబాబు సలహాలు తీసుకునేవారని ఎంపీ రామ్మోహన్ అన్నారు. దివాళా తీస్తున్న రాష్ట్రాన్ని చంద్రబాబే బాగు చేయగ లరని ప్రజలు అనుకుంటున్నారన్నారు. చంద్రబాబు హయాంలో భావనపాడు పోర్ట్ అనుమతులు తీసుకోస్తే నాలు గేళ్లు ఏం చేసారని సీఎం జగన్ను ఉద్దే శించి రామ్మోహన్ నాయుడు ప్రశ్నిం చారు. పోర్టు శంఖుస్థాపన ఎన్నికల స్టంట్ మాత్రమేనన్నారు. పోర్టు పేరు, ఊరు మార్చారని.. అసలేం చేస్తున్నా రో అర్దం కావడంలేదన్నారు.10 కిలో మీటర్ల రోడ్డే వేయలేకపోయారని.. ఇక పోర్టు నిర్మిస్తారా? అంటూ ఎద్దేవా చేశా రు. జగన్ హామీలు పేపర్లో రాసుకోవ డానికి తప్ప.. ఒక్క రూపాయి రావడం లేదన్నారు. బోగాపురం ఏయిర్పోర్టు మరో కొత్త డ్రామాగా ఆయన అభివర్ణిం చారు.

## మట్టి తరలింపును అడ్డుకున్న కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం**

శారదానగర్ వద్ద అక్రమ మట్టి రవాణాని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అడ్డుకున్నారు.ఎటువంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లలు మట్టి తరలించారు. అక్రమ మట్టి తరలింపుపై రెవెన్యూ అధికారులకు అయన ఫోన్ లో ఫిర్యాదు చేసారు. అక్రమ మట్టి రవాణాని అడ్డుకున్న టీడీపీ నేతలపై మట్టి మాఫియా మూకుమ్మడి దాడి చేస్తున్నారు. మా ట్రాక్టర్లను అడ్డుకునే అధికారం మీకెవరిచ్చారంటూ టీడీపీ నేతలపై ఎదురుదాడి చేస్తున్నారు. విషయం తెలుసుకునేందుకు వచ్చిన వీఆర్ఓపై కూడా మట్టి మాఫియా దాడికి పాల్పడింది. టీడీపీ నగర కార్యదర్శి కాంతారావుపై దౌర్జన్యానికి దిగింది. మట్టి మాఫియా దాడిని అయన తీవ్రంగా ఖండించారు.

## ఆదోనిలో లోకేష్ పాదయాత్ర

**ఆదోని**

తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కు ఆదోని టౌన్ లో టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం నాడు ఆదోని టౌన్ లో నారా లోకేష్ యువగళం పాదయాత్ర కొనసాగింది. లోకేష్ ని చూసేందుకు మహిళలు, యువత, వృద్దులు పెద్ద ఎత్తున రోడ్ల పైకి వచ్చారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి, పన్నుల భారం తో బతుకు భారంగా మారిందని లోకేష్ కి మహిళలు తమ బాధను చెప్పుకున్నారు. ఉద్యోగాలు లేక ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేసుకోవాల్సి వస్తుందని యువత ఆవేదన వ్యక్తం చేసింది. లోకేష్ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే నిత్యావసర సరుకుల ధరలు, పన్నులు, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తాం. స్థానికంగా పరిశ్రమలు తీసుకొచ్చి ఇక్కడే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని యువత తో అన్నారు.

## ప్రభుత్వ స్థలంలో వైకాపా నేతల కబ్జా

**మదనపల్లె**

ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాకుండా కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులకు లేదా అంటూ టిడిపి, జనసేన, కాంగ్రెస్ పార్టీల నాయకులతో పాటు ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని నిలదీశారు. నేడు మదనపల్లి మండలంలోని చీకలబైలు గ్రామంలో జడ్పీ హైస్కూల్ నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో అధికార పార్టీకి చెందిన నాయకుడు అక్రమంగా నిర్మాణం చేపడుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు సర్పంచ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ ధర్నాలో మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా, జనసేన పార్టీ రాయలసీమ కోకన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రెడ్డి సాహెబ్ తదితరులు మద్దతుగా నిలిచి ధర్నాలో పాల్గొన్నారు.

# ఏపీలో గులాబీకి అడగడుగునా అడ్డంకులు

**విశాఖపట్టణం:**

విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం పోరాటం పేరుతో ఏపీలో అడుగు పెట్టాలనుకున్న భారత రాష్ట్ర సమితి పరిస్థితులు అనుకూలించలేదు. ప్రైవేటీకరణను తాత్కలికంగా పక్కన పెట్టామన్న కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ప్రకటనతో విశాఖలో విజయోత్సవాల పేరుతో భారీసభ నిర్వహించాలని అనుకున్నారు. కానీ రెండు రోజులకే అది తేలిపోయింది. ఇప్పుడు బిడ్ కూడా వేయలేకపోయారు. దీంతో స్టీల్ ప్లాంట్ కార్మికసంఘ నేతలు విశాఖ స్టీల్ ప్లాంట్ ఈవోఐకి బిడ్ ఎందుకు వేయలేదని ప్రశ్నిస్తున్నారు. దీంతో ఏపీలో బహిరంగసభ పెట్టాలనుకున్న బీఆర్ఎస్ పార్టీకి ఆదిలోనే హంసపాదు ఎదురయినట్లు అయింది. బీఆర్ఎస్ పార్టీని ప్రారంభించిన తర్వాత తెలంగాణతో పాటు ఏపీలోనూ బలంగా మార్చాలనుకున్నారు. సీఎం కేసీఆర్ చాలా మంది సీనియర్ నేతలను సంప్రదించారు. కానీ ఒక్కరూ కూడా ఆసక్తి చూపించలేదు. చివరికి ప్రధాన పార్టీల తరపున మూడు సార్లు ఎన్నికల్లో పోటీ చేసి మూడు సార్లూ ఓడిపోయిన తోట చంద్రశేఖర్ ను రంగంలోకి తెచ్చారు. అయితే కేసీఆర్ దృష్టి అంతా సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మీద ఉంది. ఆయనతో చర్చలు కూడా జరిపారు. అయితే బీఆర్ఎస్కు ఏపీలో ఉన్న ఇమేజ్ దృష్ట్యా ఆయన ఆలోచిస్తున్నారు. ఈ సమస్య పరిష్కారానికి స్టీల్ ప్లాంట్ ఇష్యూ ఉపయోగపడుతుందనే పరిస్థితులు వచ్చాయి. బిడ్ వేయాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించినప్పుడు మొదట లక్ష్మీనారాయణే కేసీఆర్ ను పొగిడారు. కానీ ఇప్పుడు బిడ్ వేయకపోవడంతో ఆయన కూడా బీఆర్ఎస్లో చేరికపై ఆలోచించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తెలంగాణలో ప్రస్తుతం రాజకీయ వాతా వరణం గంభీరంగా ఉంది. అన్ని పార్టీలు పూర్తిగా ఎన్నికల మూడ్ లోకి వచ్చాయి. వచ్చే నవంబర్, డిసెంబర్లో ఎన్నికలు జరగనున్నాయి. అంటే ఇంకా గట్టిగా ఆరు నెలల సమయం కూడా లేదు. ఇలాంటి సమయంలో కేసీఆర్ ఆంధ్రాలో పార్టీ కోసం.. తెలంగాణను నిర్లక్ష్యం చేసే పరిస్థితి లేదు. ఏపీ స్టీల్ ప్లాంట్ కోసం బిడ్ వేస్తే తెలంగాణలో యాంటీ సెంటిమెంట్ పెరుగుతుదంన్న ఆందోళనతోనే కేసీఆర్ వెనక్కి తగ్గారన్న ప్రచారం ఉంది. వేల కోట్లు విశాఖ స్టీల్ ప్లాంట్ కు పెట్టే బదులు తెరిపిస్తామని తెలంగాణ ఉద్యమ సమయంలో చెప్పిన తెలంగాణ పరిశ్రమల్ని తెరిపించాలి కదా అన్న ప్రశ్న ప్రధానంగా వస్తుంది. ఇది బీఆర్ఎస్కు ఇబ్బందికరంగా మారుతుంది .అందుకే వెనక్కి తగ్గారు. ఇప్పుడు ఈ కారణంతో బహిరంగసభ పెట్టడం కష్టమే. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చినప్పటికీ.. ఇతర రాష్ట్రాల్లో పార్టీ విస్తరణపై ఇంకా దృష్టి పెట్టలేదు. మహారాష్ట్రలో మాత్రం వరుసగా మూడు సభలు పెడుతున్నారు. ఇతర రాష్ట్రాలను పట్టించుకోవడం లేదు. ఎన్నికలు ఉన్న కర్ణాటకపై అసలు దృష్టి పెట్టలేదు. ఏపీ, ఒడిషాలకు ఇంచార్జుల్ని నియమిం చినప్పటికీ ఎలాంటి కార్యకలాపాలు లేవు. తెలంగాణలో మూడో విజయం సాధిస్తే వచ్చే పాజిటివ్ ఇమేజ్తో ఇతర రాష్ట్రాల్లో పార్టీని విస్తరించాలన్న లక్ష్యంతో కేసీఆర్ ఉన్నట్లుగా తెలుస్తోంది.

# జూన్ 1వ తేదీ నాటికి పంట పొలాలకు సాగునీరు

**కాకినాడ,**



జూన్ 1వ తేదీ నాటికి కాలువల ద్వారా చివరి పంటకు సాగునీరు అందిస్తామని ఈ లోగా కాలువల మరమ్మత్తు పనులు చేసేందుకు ముందస్తు నిధులను సేకరించి సిద్ధం చేస్తామని, అలాగే పండిన ప్రతి ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) ద్వారా సేకరిస్తామని మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. కాకినాడ కలెక్టరేట్లో జరిగిన జిల్లా అభివృద్ధి మండలి (డిఆర్సి) సమావేశంనకు కాకినాడ జిల్లా ఇంచార్జ్ మంత్రి అప్పలరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ సమావేశంలో ప్రజాప్రతి నిధులు, సభ్యుల నుంచి తీసుకున్న సమాధానాలతో పాటు జిల్లా అభివృద్ధిపై ఆయన విలేకరులతో సమావేశాన్ని నిర్వహించి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ చివరి ఎకరాకు నీరు అందేలా ప్రజాప్రతినిధులు కోరారని దాంతో ఈ రెండు నెలల్లో పంట కాలువలకు రిపేరు చేస్తామని ఆ రిపేర్లకు ఎటువంటి ఆటంకం లేకుండా ముందస్తుగానే నిధిని సమకూర్చి సిద్ధం చేస్తామని చెప్పారు. అలాగే రైతుల ముందు పండిన పంటకు రైతుల ముంగిటనే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని చెప్పారు. బొండాలు పండించే రైతుల సమస్యలను ప్రజాప్రతినిధులు తమ దృష్టికి తేగా సీఎం జగన్ ప్రోద్భలంతో కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారని దీంతో కేంద్ర ప్రభుత్వం ఆ బొండాలు రకం ధాన్యం కొనేందుకు సిద్ధమైనట్లు చెప్పారు. పండిన ప్రతి పంటకు సంబంధించి ధాన్యం కొనుగోలు చేస్తామని ఇందులో ఎటువంటి టార్గెట్లు లేవన్నారు. ఈ వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. కాకినాడ సమీపంలో ఉప్పాడ మిషన్ అర్బన్ నిర్మాణం జరుగుతోందన్నారు. ఇంకా ఆయన రాజకీయాలపై స్పందించారు. 2019 ఎన్నికలలో వైకాపా ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని గడపగడపకు మన ప్రభుత్వం పేరుతో ప్రజల్లోకి వెళ్తున్నామని, వారి నుండి స్పందన అధికంగా వస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ వేణుగోపాలరావు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కౌడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ పాల్గొన్నారు.

# సహజీవనం పేరిట 35 లక్షలు స్వాహా..!

### వికలాంగ మహిళతో సహజీవనం

**జగిత్యాల,**

పుట్టుకతో దివ్యంగురాలైన ఓ యువతి కాళ్ళు లేకున్నా చిన్న కిరాణంతో స్వయం ఉపాధి పొందుతుండగా పక్కింటికి చెందిన ఓ యువతి ఈ వికలాంగురాలితో స్నేహం చేసి శారీరక సంబంధం పెట్టుకొని 35 లక్షల వరకు డబ్బులు గుంజి గుండాలతో కొట్టించగా చివరకు జగిత్యాల జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన ఇది. వివరాల్లోకి పోతే మల్లాపూర్ మండలంలోని వాల్గొండ గ్రామానికి చెందిన ఓ వికలాంగ యువతి కిరాణా దుకాణం పెట్టుకొని జీవనం కొనసాగిస్తోంది. తల్లి తండ్రుల మరణాంతరము వచ్చిన డబ్బును మధింపుచేస్తూ వ్యాపారంలో వచ్చిన డబ్బులను పోగు చేస్తోంది. ఈ వికలాంగురాలి సొమ్ముపై కన్ను పెట్టిన పక్కింటికి చెందిన నర్మద అనే యువతి ఈ వికలాంగురాలితో శారీరక సంబంధం పెట్టుకొంది. సమాజము ఏమనుకొన్నా పట్టించుకొనేది లేదనే మాయమాటలు చెప్పి ఆ వికలాంగులారికి మాయమాటలు చెప్పి 11 లక్షల 70 వేల రూపాయల వరకు ఫోన్ పే ద్వారా లాక్కున్న నర్మద మరో 23 లక్షల 30 వేల రూపాయల వరకు నగదుగా పొందిందని బాధితురాలు పేర్కొంది. ఎట్టకేలకు నర్మదకు ఇంట్లో వాళ్లు పెళ్లి సంబంధాలు చూడగా ఒక పోలీసుతో నర్మదకు పెళ్లి జరిగింది. ఈ సమయంలో నాకు పెళ్లి జరిగినా నా భర్త లేని సమయంలో నీతో సహజీవనం చేస్తానని మాట ఇచ్చిందని ఎంగేజ్ మెంట్ సమయంలో నర్మద లక్ష రూపాయలను తీసుకొన్నట్లు బాధితురాలు పేర్కొంది. అలాగె పెళ్లికి తులం బంగారం తీసుకొందని తీరా పెండ్లి జరిగి భర్తతో కాపురం చేసుకొంటున్న నర్మద అప్పటి నుంచి బాధితురాలిని పట్టించుకోవడం మానేసిందని చివరకు నాడబ్బులు ఇవ్వమని వికలాంగురాలైన బాధితురాలు అడిగితే వాల్గొండ ఊర్లో ఆరుగురు గుండాలతో విచక్షణారాహిత్యంగా కొట్టించగా బాధితురాలు మల్లాపూర్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా చికిత్సకై జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ఉన్న బాధితురాలు తమ సంఘం జగిత్యాల జిల్లా దివ్యాన్గుల హక్కుల సంక్షేమ పోరాట సమితి అద్యక్షులు లంక దాసరి శ్రీనివాస్ ను ఆశ్రయించగా జిల్లా ఎస్పీకి బాధితురాలి పక్షాన ఫిర్యాదు చేరింది.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి-టిడబ్ల్యూజేఎఫ్ సంతకాల సేకరణ

**జగిత్యాల,**

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే డిమాండ్ తో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్ ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం నాడు జగిత్యాలలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టి డబ్ల్యూజేఎఫ్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎన్. జయపాల్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం జగిత్యాలలో ఏర్పాటు చేసిన ఫెడరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టులకు నిరాశే ఎదురైందన్నారు. చివరికి ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పిన బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఎనిమిది ఏళ్ళు అవుతున్న ఇంతవరకు ఇవ్వలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీల పాత్ర పోషించిన జర్నలిస్టుల సంక్షేమంను ప్రభుత్వం విస్మరించడం బాధాకరం అని అన్నారు. ఎనిమిది ఏళ్ల కాలంలో ఇప్పుడు ఇస్తాం, అప్పుడు ఇస్తామంటూ కాలం వెళ్లదిస్తుందే తప్ప పట్టించుకోవడం ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సభ్యులు ద్యావర సంజీవరాజు, కార్యదర్శి వెంకటరమణ, కౌన్సిల్ సభ్యులు జీవన్ రెడ్డి, అలిశెట్టి మదన్ మోహన్, ఎన్నం కిషన్ రెడ్డి, ప్రెస్ క్లబ్ వర్కింగ్ ప్రెసిడెంట్ తిరునగరి శ్రీనివాస్, మోహన్ రావు, గణేష్ లవంగా, కాంత రావు, తన్వీర్ అష్రాఫ్, తదితరులు పాల్గొన్నారు

## భారతీయ జనతా పార్టీ మండల సమావేశం



**కోనసీమ**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శుక్ర వారం కాట్రేనికోన భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు మట్టా సూరిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండల సమావేశమునకు ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు కరి చిట్టిబాబు పాల్గొన్నారు ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ మండలంలోని ప్రతి బూత్ కు కమిటీ సభ్యులను నియమించాలని భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోడీ నాయకత్వంలో అనేకమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు ప్రతి పేదవాడు ఇల్లు నిర్మించుకోవడానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా లక్ష 80 వేల రూపాయలు మంజూరు చేస్తున్నది అదే విధముగా జలజీవన్ మిషన్ ద్వారా ఉచితముగా ప్రతి ఇంటికి వాటర్ సప్లై మరియు ప్రతి ఇంటికి స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా టాయిలెట్స్ నిర్మిస్తున్నారు అని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గ్రంధి నానాజీ జిల్లా ఎస్సీ మోర్చాఅధ్యక్షులు పలివెల రాజు సుంకర సాయి గ్రంధి నాని బాబు కొత్తలంక సురేష్ సుంకర నాగేశ్వరావు మట్ట శివకుమార్ కోట సత్యప్రసాద్ ఏ సాయిబాబా చెరుకు రాంబాబు పాల్గొన్నారు

## త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ను విడుదల

**అమరావతి** :



నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది ఏపీ సర్కార్. త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ను విడుదల చేయనున్నట్లు మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. శు క్రవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటారన్నారు. ఉపాధ్యాయులు, జూనియర్ లెక్చరర్స్ బదిలీలపై సమీక్షించామని.. త్వరలో బదిలీలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బదిలీలకు పారదర్శకమైన విధానాన్ని తీసుకొస్తామని చెప్పారు. ఇందుకోసం ఇతర రాష్ట్రాలలో ఉన్న చట్టాలను కూడా పరిశీలిస్తున్నామని మంత్రి తెలిపారు. అలాగే కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసే అంశంపై పరిశీలిస్తున్నామన్నారు. సీఎం జగన్ దీని పరిష్కారానికి చిత్తశుద్ధితో ఉన్నారని తెలిపారు. విద్యార్థులుకు రాగి జావా నిలిపివేశామంటూ వస్తున్న ప్రచారం తప్పు అని.. తాత్కాలికంగా నిలిపివేసినట్లు చెప్పుకొచ్చారు. పరీక్షలు, ఒంటి పూట బడుల వలన ప్రస్తుతానికి రాగిజావాకు బదులు చిక్కీలు ఇస్తున్నామని మంత్ర బొత్స సత్యనారాయణ వెల్లడించారు.

## ఈనెల 24 న రాయల విగ్రహం అవిష్కరణ

**మదనపల్లె**

అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలోని మల్లికార్జున సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఈ నెల 24వ తేదీన ఆవిష్కరించడం జరుగుతుందని టిటిడి బోర్డు సభ్యులు పోకల అశోక్ కుమార్ తెలిపారు. నేడు మదనపల్లె పట్టణంలోని మల్లికార్జున సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఆయన మదనపల్లె బలిజ సేవా సమితి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, బలిజ సేవా సమితి అధ్యక్షులు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలో బలిజ కులస్థులు అధికంగా ఉన్నారని, వారి కల శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటు అని పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్ భాషా తదితరుల చేతుల మీదుగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించడం జరుగుతుందని తెలిపారు. కావున బలిజ కులస్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## ముగిసిన సామాజిక చైతన్య పాదయాత్ర

**నరసాపురం**

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నుండి నరసాపురం వరకు పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సామాజిక చైతన్య పాదయాత్ర నరసాపురం లో ముగిసింది. నరసాపురం సబ్ కలెక్టర్ సూర్య తేజ కి వినతి పత్రం నిమ్మల రామానాయుడు అందించారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని కోరారు.జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ పథకాలు రద్దు చేశారని.ఎస్సీలకు తీవ్ర అన్యాయం చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని తాడేపల్లి లో మొద్దు నిద్రపోతున్న సీఎం జగన్ ను తట్టి లేపెందుకే సామాజిక చైతన్య పాదయాత్ర చేపట్టామని రామానాయుడు తెలిపారు.రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్లు బాయ్ బాయ్ జగన్ ఆయన ముందుగానే జరగబోయే దాన్ని చూపించారని ఆయన తెలిపారు.రాజధాని పేరుతో ఉత్తరాంధ్ర ప్రజలను మోసం చేస్తున్న జగన్మోహన్ రెడ్డికి ఉత్తరాంధ్ర ప్రజలు రానున్న రోజుల్లో బుద్ధి చెప్పనున్నారని.అసెంబ్లీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సొంత పార్టీ ఎమ్మెల్యేలు బాయ్ బాయ్ జగన్ చెప్పేసారు.జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా బుద్ధి జ్ఞానం తెచ్చుకుని నిలిపివేసిన ఎస్సీ బీసీ మైనారిటీ పథకాలను కొనసాగించాలని రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు గ్రామ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## దుండగుల కాల్పుల్లో ఏలూరు వాసి మృతి

అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం రేపాయి. దుండగుల కాల్పుల్లో తెలుగు యువకుడు ఒకరు దుర్మరణం చెందాడు. వెస్ట్ కొలంబస్‌లో అర్ధరాత్రి 12.50 లకు జరిగిన ఈ ఘటనలో ఏలూరు వాసి వీర సాయిష్ ప్రాణాలు కోల్పోయాడు. ఫ్రాంక్లింటన్, 1000 వెస్ట్‌బ్రాడ్ స్ట్రీట్‌లోని షెల్ గ్యాస్ స్టేషన్ పని చేస్తున్న వీర.. దోపిడీకి ప్రయత్నించిన దొంగను అడ్డుకున్నాడు. దాంతో రెచ్చిపోయిన దుండగులు, సాయిష్ వీరపై కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో సాయిష్ ప్రాణాలు కోల్పోయాడు. కాగా, కాల్పులకు తెగబడిన అనుమానితుడి ఫోటోలను కొలంబస్ పోలీసులు విడుదల చేశారు. ఈ సంవత్సరం కొలంబస్‌లో ఇది 50వ హత్య కావడం గమనార్హం. 24 ఏళ్ళ సాయిష్ వీర మరో రెండు వారాల్లో ఉద్యోగం మానేయాలని అకున్నాడు. కానీ, ఇంతలోనే ఈ అనుకోని ఘటన జరగడం.. అతని కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచేసింది. మధ్య తరగతి కుటుంబానికి చెందిన సాయిష్ వీర కొలంబస్‌లో మాస్టర్స్ చేస్తున్నాడు. అందరికి అడగ్గానే హెల్ప్ చేసే వాడనీ.. అలాంటి వ్యక్తికి ఇలా జరగడం బాధాకరమని అతని స్నేహితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయిష్ వీర బాడీని అమెరికా నుంచి భారత్‌కు తరలించేందుకు స్నేహితులు సన్నాహాలు చేస్తున్నారు. తరలింపు భారీ ఖర్చుతో కూడుకున్నది కావడం వల్ల ఫండ్ రైజింగ్ చేపడుతున్నారు. సాయిష్ బాడీని ఇండియాలోని సొంతూరికి తరలించేందుకు సాయం చేయాలని అతని స్నేహితుడు నవీన్ క్రిష్ణ కాపిశెట్టి ట్విటర్‌లో కోరారు. అందరూ ఆ ట్వీట్‌ను రీట్వీట్ చేయాలని పిలుపునిచ్చారు. అతనికి కుటుంబానికి మేలు చేసినవారు అవుతారని పిలుపునిచ్చారు. ఇందుకోసం భారత ప్రభుత్వం కూడా సహకరించాలని కోరుతూ.. ప్రధాన మంత్రి కార్యాలయాన్ని, అమెరికాలోని ఇండియన్ ఎంబసీని, హైదరాబాద్ లోని అమెరికన్ ఎంబసీని ట్యాగ్ చేశాడు. సాయిష్ కుటుంబానికి అతని చివరి చూపులు కల్పించే బాగ్యం కల్పించాలని కోరాడు.

## ీ ఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో తండ్రీకొడుకులు అరెస్టు

**హైదరాబాద్**

తెలంగాణలోనే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో మర ఇద్దరు అరెస్టు అయ్యారు. ఈసారి తండ్రీ కుమారుడిని సిట్ అధికారులు అరెస్టు చేశారు. వీళ్లిద్దరు నిందితుల నుంచి పేపర్ కొనుగోలు చేసినట్టు గుర్తించారు. అందుకే ఈ ఉదయం అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీ కేసులో నిందితుల జాబితా పెరిగిపోతోంది. విచారణ చేసే కొద్ది కొత్త కొత్త పేర్లు బయటకు వస్తున్నాయి. నిందితుల ఇచ్చిన సమాచారం, వారి ఫోన్ డేటా ఆధారంగా కేసును చాలా వేగవంతంగా దర్యాప్తు చేస్తున్నారు. అందులో భాగంగానే ఇద్దర్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో అరెస్టైన డాక్య ఇచ్చిన సమాచారం మేరకు జనార్దన్, అతని తండ్రి మహిభయ్యాను సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరు కూడా డాక్యకు డబ్బులు ఇచ్చి ఏఈ ఎగ్జామ్ పేపర్ కొన్నట్టు నిర్ధారించారు. అందుకే వీళ్లను కూడా అదుపులోకి తీసుకున్నారు. డాక్యకు జనార్దన్ డబ్బులు ఇచ్చి పేపర్ కొన్నట్టు ఆధారాలు సేకరించారు సిట్ అధికారులు. జనార్దన్‌కు ఆయన తండ్రి మహిభయ్యా డబ్బులు సమకూర్చినట్టు తేల్చారు

## ఆత్మీయ సమ్మేళనాలను పండుగలా నిర్వహించాలి

**హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్‌ఎస్ చేపట్టిన ఆత్మీయ సమ్మేళనాలను పండుగలా నిర్వహించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అన్ని నియోజకవర్గాల్లో ఈనెల 25వ తేదీన నియోజకవర్గస్థాయి బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. సీఎం కేసీఆర్, పార్టీ వరింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలు ఎంతో ఉత్సాహంగా సాగుతున్నాయని అన్నారు. హైదరాబాద్ నగరంలో కూడా అనేక నియోజకవర్గాల్లో డివిజన్ స్థాయి సమ్మేళనాలు ఘనంగా నిర్వహించారని చెప్పారు. 24 నాటికల్లా డివిజన్ స్థాయి సమావేశాలు పూర్తి చేయాలని, మిగిలిన డివిజన్లలో కూడా ఈనెల 24వ తేదీ లోగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి తలసాని సూచించారు. సమ్మేళనాల సందర్భంగా జెండాలు, తోరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించాలన్నారు. ఆయా నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి పనులను తెలియజెప్పేలా ప్రగతి నివేదికను రూపొందించి ఆత్మీయ సమ్మేళనంలో వివరించాలని చెప్పారు. ఈ నెల 25వ తేదీన నిర్వహించే నియోజకవర్గ సమ్మేళనాలకు నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కార్పొరేటర్లుగా పోటీ చేసిన వారిని, డివిజన్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులను ఆహ్వానించాలని వివరించారు. అన్ని డివిజన్లలో పార్టీ పతాకాలను ఆవిష్కరించి సమావేశం వద్దకు రావాలని చెప్పారు.

## ఢిల్లీలోని సాకేత్ కోర్టులో కాల్పులు

**న్యూఢిల్లీ**

దేశ రాజధానిలోని సాకేత్ కోర్టు కాంప్లెక్స్ లో శుక్రవారం జరిగిన నాలుగు రౌండ్ల కాల్పుల్లో న్యూ ఫ్రెండ్స్ కాలనీకి చెందిన ఓ మహిళ గాయపడింది. కాల్పుల శబ్దం విన్న ఢిల్లీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వాంగ్మూలం ఇచ్చేందుకు ఆ మహిళ ఈ రోజు కోర్టుకు వచ్చినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఆమె ఒక కేసులో సాక్షి. ఈ సమయంలో ఆమెపై కాల్పులు జరిగాయి. ప్రస్తుతం ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. ఢిల్లీలోని సాకేత్ కోర్టు ఆవరణలో శుక్రవారం కోర్టు ప్రొసీడింగ్స్ ప్రారంభం కాగానే కాల్పుల ఘటన చోటుచేసుకుంది. కాల్పులు ప్రారంభం కాగానే ప్రజలు భయంతో ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీశారు. లాయర్ల డ్రెస్‌లో దుండగులు సాకేత్ కోర్టుకు వచ్చారని చెబుతున్నారు. మహిళను గుర్తు పట్టగానే ఆమె వద్దకు వచ్చి దుండగులు నాలుగు రౌండ్ల కాల్పులు జరిపారు. మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అక్కడే ఆమెతో ఉన్న వ్యక్తులు పోలీసుల సహాయంతో యువతిని చికిత్స నిమిత్తం ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కు తరలించారు.

## సాయి కల్యాణి, కుటుంబ సభ్యులను పరామర్శించిన టీడీపీ నేతలు

**హనుమాన్ జంక్షన్**

గన్నవరం దాడి ఘటన కేసులో అక్రమ అరెస్టుకు గురై బుధవారం బెయిల్ పొందిన అనంతరం జైలు నుంచి తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మూల్పూరి సాయికల్యాణి విడుదలైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శుక్రవారంనాడు సాయి కల్యాణి, కుటుంబ సభ్యులను కృష్ణా జిల్లా, గన్నవరం నియోజకవర్గం, బాపులపాడు మండలం, హనుమాన్ జంక్షన్ లోని వారి నివాసంలో తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రివర్యులు, నక్కా ఆనంద్ బాబు, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి మరియు శాసనమండలి సభ్యులు, పరుచూరి అశోక్ బాబు, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి మరియు నోలెడ్జ్ సెంటర్ చైర్మన్ గురజాల మాల్యాద్రి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మరియు రాష్ట్ర బ్రాహ్మణ సాధికారిక సమితి కన్వీనర్ బుచ్చిరాం ప్రసాద్, టీడీపీ కేంద్ర కార్యాలయ మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్ర కుమార్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి పీనెపె ఈశ్వర్, టీడీపీ నాయకులు సుగాసాని కృష్ణా ప్రసాద్, దామోదర్ రాజు, తదితరులు పరామర్శించి ధైర్యం చెప్పారు. రెట్టించిన ఉత్సాహంతో ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తూ, తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని సాయి కల్యాణి తెలిపారు.

## సీమంతం కోసం పుట్టింటికి వెళ్లిన గర్భిణి.. మృతి

**హైదరాబాద్**

పాపం.. వారిద్దరూ ఎన్నో ఆశలతో పెళ్లి చేసుకున్నారు. అంతాబాగానే ఉంది.. భార్య కడుపులో ఓ కాయపడగానే.. దంపతులిద్దరూ సంతోషంలో మునిగితేలారు.. గర్భం దాల్చి ఆరు నెలలు పూర్తవుతున్న నేపథ్యంలో.. సీమంతం చేయాలని కుటుంబసభ్యులు నిర్ణయించుకున్నారు. సీమంతం వేడుకకు పుట్టింటికి రావాలని చెప్పడంతో ఆమె ఆనందంతో వెళ్లింది.. మరికొన్ని రోజుల్లో పండంటి బిడ్డకు జన్మనివ్వాల్సిన ఆమె.. విధిరాతకు బలైంది. సీమంతం కోసం వచ్చి పుట్టింట్లోనే ప్రాణాలు కోల్పోయింది. ఈ షాకింగ్ ఘటన హైదరాబాద్ నగరంలో చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు బాత్‌రూమ్‌లో జారిపడి, చికిత్స పొందుతూ ఓ గర్భిణి ఆసుపత్రిలో మృతి చెందింది. ఈ సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తిలక్‌నగర్ ప్రాంతానికి చెందిన హేమంత్, కల్పన భార్యభర్తలు.. హేమంత్ ప్రైవేట్ ఉద్యోగి కాగా.. ఆయన భార్య కల్పన (28) ఆరు నెలల గర్భవతి. ఇంట్లోనే ఉంటుంది. అయితే, ఏడవనెల దగ్గరపడుతుండటంతో సీమంతం నిమిత్తం ఆమెను సంజీవయ్యనగర్ లోని పుట్టింటికి 15 రోజుల క్రితం పంపించారు. ఈ క్రమంలో కల్పన గురువారం ఉదయం బాత్‌రూమ్‌లో జారి కిందపడింది. గమనించిన కుటుంబసభ్యులు.. గాయాలపాలైన ఆమెను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆసుపత్రిలో ఫిట్స్, గుండెపోటు రావడంతో కల్పన మృతి చెందినట్లు వైద్యులు, పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కాచిగూడ పోలీసులు తెలిపారు

## వివేకాలో కేసు తెరపైకి రెండో భార్య

**కడప**

మాజీ మంత్రి వివేకా హత్య కేసులో సీబీఐ దూకుడుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో.. ఆయన రెండో భార్య షేక్ షమీమ్‌పై చాలామంది ఫోకస్ పడింది. అసలు ఆమె వెర్షన్ ఏంటి..? ఆమెతో వివేకా ఎలాంటి విషయాలు పంచుకునేవారు..? మర్డర్ గురించి ఎవరిపై ఆమెకు అనుమానాలు ఉన్నాయి వంటి విషయాలు ఉత్కంఠను రేపుతున్నాయి. ఈ క్రమంలోనే ఆమె తొలిసారిగా ఇచ్చిన స్టేట్మెంట్ సంచలనంగా మారింది. వివేకాతో 2010 లో వివాహం అయ్యిందని.. 2011లో మరోసారి వివాహం చేసుకున్నట్లు షమీమ్ తెలిపారు. 2015లో తమకు షహన్షాన్ పుట్టినట్లు వివరించారు. వివేక హత్యకు కొన్ని గంటల ముందు కూడా తనతో ఫోన్‌లో మాట్లాడినట్లు షమీమ్ తెలిపారు. తమ వివాహం వివేకా కుటుంబ సభ్యులకు ఇష్టం లేదని ఆమె తెలిపారు. వివేకా బామ్మర్ది, అల్లుడి అన్న నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి తనను, తన కుటుంబ సభ్యుల్ని ఎన్నోసార్లు బెదిరించారని ఆమె తెలిపారు. వివేకాకు దూరంగా ఉండమని సునీతా రెడ్డి సైతం హెచ్చరించేదని షమీమ్ వెల్లడించారు. వివేకా ఆస్తిపై సునీత భర్త రాజశేఖర్‌కు, వివేకా పదవిపై శివప్రకాశ్ రెడ్డికి కాంక్ష ఉండేదన్నారు. తమ కొడుకు షహన్షాన్ పేరు మీద 4 ఏకరాలు కొందామని వివేకా అనుకున్నా.. శివ ప్రకాష్ రెడ్డి ఆపేశాడని ఆమె వివరించారు. వివేకాను సొంత కుటుంబ సభ్యులే దూరం పెట్టారని.. అన్యాయంగా వివేకా చెక్ పవర్ తొలగించారని ఆమె ఆరోపించారు. చెక్ పవర్ తొలగించడంతో వివేకా ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడని షమీమ్ తెలిపారు. బెంగుళూరు ల్యాండ్ సెటిల్మెంట్ ద్వారా 8 కోట్లు వస్తాయని వివేకా తనతో చెప్పాడని.. హత్యకు కొన్ని గంటల ముందు కూడా 8 కోట్లు గురించి ఆయన తనతో మాట్లాడినట్లు ఆమె తెలిపారు. చనిపోయిన తరువాత వివేకా ఇంటికి వెళ్దామనుకున్న.. శివ ప్రకాష్ రెడ్డి మీద భయంతో అటు వైపు వెళ్లలేకపోయానని షమీమ్ వెల్లడించారు.

## ఏప్రిల్ 25 నుంచి వేసవి సెలవులు

**హైదరాబాద్**

తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే 1 నుంచి 9వ తరగతి విద్యార్థుల పరీక్షలు ఏప్రిల్ 20తో ముగిశాయి. ఏప్రిల్ 12 నుంచి 20 వరకు ఎస్‌ఏ-2 పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 21 నుంచి 24 వరకు జవాబు పత్రాలను మూల్యాంకనం చేయనున్నారు. ఆ తర్వాత విద్యార్థులకు మార్కులు చెప్పి సెలవులు ప్రకటిస్తారు. పరీక్షల ప్రక్రియ ముగియడంతో ఏప్రిల్ 25 నుంచి వేసవి సెలవులు ప్రారంభంకానున్నాయి. జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉండనున్నాయి. పాఠశాలలు తిరిగి జూన్ 12న ప్రారంభం కానున్నాయి. ఇదిలా ఉంటే కొన్ని ప్రైవేట్ పాఠశాలలు మాత్రం శుక్రవారం ఏప్రిల్ 21 నుంచే వేసవి సెలవులు ప్రకటించేశాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 1-9 తరగతుల విద్యార్థులకు జగన్ సర్కార్ ఏప్రిల్ 30 నుంచి వేసవి సెలవులను ప్రకటించనున్నట్లు సమాచారం. వీరికి ఈ నెల 27వ తేదీతో పరీక్షలు ముగియనుండగా.. మరో రెండు రోజులు ఫలితాలు వెల్లడి, పేరెంట్స్ మీటింగ్స్ మొదలైనవి ఉంటాయి. అవి పూర్తి కాగానే వేసవి సెలవులను ప్రకటించనున్నారని ఈ నెల 30 నుంచి స్కూల్స్‌కు సెలవులు ఇచ్చే అవకాశం ఉందని పాఠశాల విద్యాశాఖ ద్వారా అనధికారికంగా తెలిసింది. అయితే ప్రస్తుతం రాష్ట్రమంతటా పగటి ఉష్ణోగ్రతలు అధికం అవుతుండటంతో.. ఈ సెలవులు షెడ్యూల్ కాస్త ముందుకు జరిగే ఛాన్స్ ఉందట. కాగా, 2023-24 విద్యా సంవత్సరానికి గానూ స్కూల్స్ మళ్లీ తిరిగి జూన్ 12 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈసారి ఏపీ విద్యార్థులకు సుమారు 45 రోజుల పాటు వేసవి సెలవులు ఇవ్వనున్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచడానికి ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సెలవుల్లో 'మేము చదవడాన్ని ఇష్టపడతాం' అనే కార్యక్రమాన్ని అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ ఏప్రిల్ 19న ఆదేశాలు జారీచేసింది. ఈ కార్యక్రమాన్ని మే 1 నుంచి జూన్ 10 వరకు అమలు చేయాలని సూచించింది. ఉపాధ్యాయులు, అధికారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆదేశించింది. పాఠశాలలోని విద్యార్థులను బృందాలుగా విభజించి ఉపాధ్యాయులు దత్తత తీసుకోవాలని, వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసి, రోజువారీగా కథలను పోస్ట్ చేయాలని ఆదేశించింది. ఆ కథలు చదివాక విద్యార్థుల అభిప్రాయాలను సేకరించాలని పేర్కొంది.

## బెట్టింగ్ రాయుళ్ల పని పట్టడంలో పోలీసులు

**రంగారెడ్డి**

ప్రస్తుతం ఐపీఎల్ ఫీవర్ గట్టిగానే నడుస్తోంది. దీన్నే బెట్టింగ్ రాయుళ్లు క్యాష్ చేసుకుంటున్నారు. అందరూ ఐపీఎల్ మ్యాచ్ చూస్తూ ఎంజాయ్ చేస్తుంటే.. పోలీసులు మాత్రం బెట్టింగ్ రాయుళ్ల పని పట్టడంలో బిజీబిజీగా ఉన్నారు. నగర శివారులో బెట్టింగ్ స్థావరాలపై పోలీసులు దాడులు చేసి.. బెట్టింగ్ రాయుళ్లు బ్యాండ్ వాయిస్తున్నారు పోలీసులు. భారత్‌లో జరుగుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్ లపై జోరుగా బెట్టింగ్ కొనసాగుతుంది. మ్యాచ్ స్టార్ట్ చేసే టాస్ దగ్గర నుంచి ఏ బంతికి ఏం జరుగుతుంది అనే దానిపై బెట్టింగ్ కడుతున్నారు. హైదరాబాద్ నగరశివారులో ఎఖఒ బెట్టింగ్ నిర్వహిస్తున్న స్థావరాలపై పోలీసుల దాడి చేశారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఎఖఒ క్రికెట్ బెట్టింగ్ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ దాడుల్లో 12 మందిని అరెస్టు చేయగా..ఐదుగురు పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి 50 లక్షల రూపాయల నగదు, బ్యాంకు ఖాతాల్లో 3 లక్షల 29 వేలు.. స్మార్ట్ ఫోన్స్ 20, 8 ల్యాప్ టాప్ లు.. 43 కీ ప్యాడ్ ఫోన్స్, 4 టీవీలు ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం కోటి 41 లక్షల 52 వేలు రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వెల్లడించారు. నిందితులపై గేమింగ్ యాక్ట్ కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామని, మిగిలిన ఐదుగురుని కూడా త్వరలోనే పట్టుకుంటామని మేడ్చల్ డీసీపీ సందీప్ రావు వెల్లడించారు.

## గతుకుల గజ్వేల్‌బతుకుల గజ్వేల్ అయింది

**గజ్వేల్**

గజ్వేల్ బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర మంత్రి హరీశ్ రావు హజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ నేను ఒక్కటే చెబుతున్న అందరం కలిసి రానున్న రోజులలో మన బీఆర్‌ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలి. గజ్వేల్ అభివృద్ధి గజమాల లాంటిది. గుండె మీద చేయివేసుకుని గజ్వేల్ అభివృద్ధి చెప్పండి. ఎవరైనా గజ్వేల్ కు ఏం చేసింద్రని అడిగితే మన ముఖ్యమంత్రి అన్నీ చేసిండని చెప్పాలి. నేను తెలంగాణ రాకముందు సిద్ధిపేటలో ఎమ్మెల్యేగా ఉన్న రోజుల్లో ఆనాడు రైతులు, చేనేత కార్మికులు చనిపోతే పక్క రాష్టల నుండి విలేకరులు వచ్చి వార్తలు రాస్తుండేనని అన్నారు. 60 సంవత్సరాలలో జరగని అభివృద్ధిని 6 సంవత్సరాలలో చేసి చూపాడు మన ముఖ్యమంత్రి కేసీఆర్. మునుపు గణేష్ నిమర్జనాలు, బతుకమ్మ పండుగలు వస్తే ఏ చెరువులో వేయాలో తెల్వక పోతుండే. గజ్వేల్ కు మన ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చాక రింగు రోడ్డు, పార్కులు, రైల్వేస్టేషన్, డ్యాములు తెచ్చాడు. గతుకుల గజ్వేల్ ను బతుకుల నిలయంగా మార్చిండు. ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ కు రాకముందు యాసంగిలో 7 వేల ఎకరాల సాగు చేసేవారు. ఇప్పుడు 17వేల ఎకరాలను సాగు చేస్తున్నారు. 60 ఏళ్ళు ఎనకకు ఉన్న గజ్వేల్ ను 60 ఏళ్ళు ముందుకు తీసుకుపోయాడని అన్నారు. రాష్ట్రంలో నాకు తెలిసి పార్టీలను రెండు పర్యాయాలు నిల బెట్టిన వారు ఒకరు ఎన్టీఆర్ మరొకరు కేసీఆర్. మన రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను కేంద్ర ప్రభుత్వాలు నకలు కొడుతున్నాయి. దేశంలో మార్పు కోసం మన కేసీఆర్ బయలు దేరిండు. మన నినాదం ఒక్కటే రైతు నినాదమని అన్నారు. గులాబీ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు గులాం గిరి చేస్తాం తప్ప ఢిల్లీ పెద్దలకు కాదు. నిజాలను ఎప్పుడూ ప్రజల ముందు పెట్టాలని ఆనాడు బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పారని అన్నారు.

## సైకిల్ మారథాన్

**గూడూరు**

సైకిల్ వినియోగం ద్వారా కలుగు ప్రయోజనాలను ప్రజలకు తెలియజేసేందుకు ఎన్బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మార్తాన్ నిర్వహించడం అభినందనీయమని గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. కోట మండలం విద్యానగర్ ప్రాంతానికి చెందిన ఎన్బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సైక్లింగ్ మార్తాన్ కార్యక్రమాన్ని 25 కిలోమీటర్ల మేర విద్యానగర్ నుండి గూడూరు పట్టణం వరకు నిర్వహించారు .డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు సైకిల్ వినియోగం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని అదేవిధంగా శారీరిక దృఢత్వం పెంపొందించుకోవచ్చు అని తెలిపారు ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులను అభినందించినట్లు తెలిపారు . ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన అధ్యాపకులు, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు .

## పేద ముస్లింలకు రంజాన్ తోఫా

**గూడూరు**

నిజమైన అవసరం ఉన్న వారిని గుర్తించి వారికి చేయూత అందిస్తూ సేవా కార్యక్రమాలునిర్వహిస్తూ ప్రజల్లో నమ్మకాన్ని చూరగొన్న స్వచ్ఛంద సంస్థ ప్రగతి సేవా సంస్థ అని గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు .గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు .రంజాన్ పండుగ సందర్భంగా పట్టణానికి చెందిన ప్రగతి సేవా సంస్థ గత నాలుగు సంవత్సరాలుగా రంజాన్ తోఫా పేద ముస్లింలకు అందజేస్తుంది . ఈ క్రమంలో గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ముస్లింలందరూ సంతోషంగా పండుగ జరుపుకోవాలని ప్రగతి సేవా సంస్థ ఈ తరహా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు . ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ నిర్వాహకులు చంద్రశేఖర్ , రహీం , సురేందర్ రెడ్డి , సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు

## జగనన్నే మా భవిష్యత్తు

**ఏలూరు**


పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం దొడ్డిపట్లలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు .ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు వల్ల మీ ఇంటిలో లబ్ది జరిగిందా మళ్లీ జగనన్నే రావాలని కోరుకుంటున్నారా అంటూ మహిళలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ప్రతిపక్షాలు టిడిపి ని ఒక్కటే అడుగుతున్నానని సంక్షేమ పథకాలతో డబ్బులు వృధా చేస్తున్నామంటున్నారు వచ్చే ఎన్నికల్లో మేము అధికారంలోకి వస్తే ప్రస్తుత పథకాలన్నీ రద్దు చేస్తాం అని మాట చెప్పి ఎన్నికలకు వచ్చే ధైర్యం టిడిపికి ఉందా అంటూ ప్రశ్నించారు అలా చేస్తే ప్రజలు ఎవరిని గెలిపిస్తారో చూద్దాం నీకు డిపాజిట్లు రావడం కూడా గొప్పేనని అన్నారు. మేము మాత్రం మరలా పథకాలన్నీ యధావిధిగా అమలు చేస్తామని ఎన్నికలకు వెళ్తామన్నారు

ప్రభుత్వ పథకాలపై ప్రజల నుండి వచ్చిన స్పందన ద్వారా చాలా సంతోషంగా ఉన్నామని ముఖ్యంగా మహిళలు చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని మరలా జగనే రావాలని కోరుతున్నారని అన్నారు దొడ్డిపట్లలోని మత్స్యకార ఇళ్ల వద్దకు వెళ్ళినప్పుడు మత్స్యకారులకు మత్స్యకార భరోసా అందడం లేదని మీడియా అడిగిన ప్రశ్నకు కేవలం మత్స్యకారు భరోసా అనేది సముద్రంలో వేటకు వెళ్లే వారికి మాత్రమే వర్తిస్తుందని మిగిలిన వారికి కూడా వచ్చేలా ప్రయత్నం చేద్దాం మరల మేనిఫెస్టోలో అమలుపరిచేలా ప్రయత్నం చేద్దాం అంటూ సమాధానం ఇచ్చారు

# విరూపాక్ష సాయి ధరమ్ తేజ్ భయపెట్టారా?



సాయి ధరమ్ తేజ్ కథానాయకుడిగా నటించిన తాజా సినిమా 'విరూపాక్ష'. ప్రమాదానికి (బైక్ యాక్సిడెంట్) గురైన తర్వాత ఆయన నటించిన చిత్రమిది. సుకుమార్ శిష్యుడు కార్తీక్ దండు దర్శకత్వం వహించిన ఈ సినిమా ఎలా ఉంది? కమర్షియల్ సినిమాలకు భిన్నంగా సూపర్ నేచురల్ మిస్టరీ యాక్షన్ థ్రిల్లర్ సినిమా చేసిన సాయి ధరమ్ తేజ్ విజయం అందుకుంటారా? లేదా? రుద్రవనంలో అమ్మవారి జాతర ఉండటంతో సూర్య (సాయి ధరమ్ తేజ్) వెళతాడు. ఆ ఊరి సర్పంచ్ హరిశ్చంద్ర ప్రసాద్ (రాజీవ్ కనకాల) కుమార్తె నందిని (సంయుక్తా మీనన్)ను ప్రేమిస్తాడు. ఊరి నుంచి సూర్య వెళ్ళిపోయే సమయంలో అమ్మవారి గుడిలో ఓ వ్యక్తి మరణిస్తాడు. దాంతో ఊరికి అరిష్టం అని అష్టదిగ్బంధనం వేస్తారు. అప్పుడు ఒకరి తర్వాత మరొకరు... నలుగురు మరణిస్తారు. ఒక దశలో ఆ మరణాలను ఆపడానికి ఏకైక పరిష్కార మార్గం నందిని సజీవ దహనమే అని పూజారి చెబుతారు. అలా ఎందుకు చెప్పారు? ప్రేమించిన అమ్మాయిని, ఊరిలో ప్రజలను కాపాడటం కోసం సూర్య ఏం చేశాడు? అనేది సినిమా. విశ్లేషణ లాజిక్ ఎండ్ అయిన చోట మేజిక్ మొదలు అవుతుంది చిత్ర పరిశ్రమ బలంగా నమ్మే సూత్రం ఇది. దర్శకుడు కార్తీక్ దండు సైతం ఓ మేజిక్ నమ్ముకున్నారు... అదే అజనీష్ లోక్ నాథ్ సంగీతాన్ని! ఆ నేపథ్య సంగీతానికి తోడు గురువు సుకుమార్ స్క్రీన్ ప్లే �c శ్యామ్ దత్ సినిమాటోగ్రఫీ!'విరూపాక్ష' ప్రచార చిత్రాలు చూస్తే... ఇది ఏ తరహా చిత్రమో ప్రేక్షకులకు అర్థం కావడం పెద్ద కష్టం ఏమీ కాదు. ఇటువంటి సినిమాల్లో ప్రేమకథను ఆశించి ఎవరూ థియేటర్లకు రారు. ఆ ప్రేమ కథే సినిమాకు అడ్డంకిగా నిలిచింది. సినిమా మొదలు, చివరిలో ప్రేక్షకుడికి పంటి కింద రాయిలా తగులుతుంది. ప్రేమ కథను పక్కన పెట్టి హారర్ అంశాలకు వస్తే సినిమా అద్భుతమే!'విరూపాక్ష' ప్రారంభమే ఆసక్తిగా మొదలైంది. ఒళ్ళు జలదరించే సన్నివేశంతో కార్తీక్ దండు సినిమాను మొదలు పెట్టారు. నేరుగా కథలోకి వెళ్ళిపోయారని సంతోషించే లోపు ప్రేమ కథను తీసుకొచ్చి కాసేపు పక్క చూపులు చూసేలా చేశారు. అయితే, అసలు కథలోకి వెళ్ళింది మొదలు పతాక సన్నివేశాల వరకు ఉత్కంఠకు గురి చేస్తూ, మధ్య మధ్యలో భయపెడుతూ ఎడ్జ్ ఆఫ్ ది సీట్ థ్రిల్ ఇచ్చారు. సినిమా ప్రారంభం నుంచి ప్రేక్షకుడి మదిలో సందేహాలు కలుగుతూ ఉంటాయి. ఈ క్షుద్ర పూజలకు కారణం ఎవరు? అని ఆలోచిస్తూ ఉంటారు. అసలు వ్యక్తిని చివరి వరకు రివీల్ చేయకుండా సస్పెన్స్ మైంటైన్ చేయడంలో సుకుమార్ 100 శాతం సక్సెస్ అయ్యారు (సినిమా చూడాలనుకుంటే సోషల్ మీడియాలో స్పాయిలర్స్ జోలికి అసలు వెళ్లొద్దు). ఆయన స్క్రీన్ ప్లే సూపర్బ్! దానికి తోడు అజనీష్ నేపథ్య సంగీతం, శ్యామ్ దత్ ఛాయాగ్రహణం కొన్ని చోట్ల భయపెట్టాయి. సాంకేతికంగా సినిమాలో ఉన్నత విలువలు ఉన్నాయి. అందరి నుంచి మంచి అవుట్ పుట్ తీసుకున్న దర్శకుడు కార్తీక్ దండు... క్లైమాక్స్ ట్విస్ట్ తర్వాత సన్నివేశాన్ని ఇంకా బాగా రాసుకుని ఉంటే థియేటర్లు దద్దరిల్లిపోయేవి. అప్పటి వరకు ఉన్న 'హై'ను ఆ సీన్ కాస్త డౌన్ చేసింది. అందులో లాజిక్ కూడా లేదు. అయితే, క్లైమాక్స్ ట్విస్ట్ మాత్రం సూపర్బ్! రెగ్యులర్ హారర్ థ్రిల్లర్ సినిమాలకు భిన్నంగా కొత్త కథను చూపించడంలో, పల్లెటూరిలో హారర్ ఎలిమెంట్స్ సెటప్ చేయడంలో దర్శకుడు సక్సెస్ అయ్యాడు. నటీనటులు ఎలా చేశారు? : హీరోయిజం చూపించే సినిమా కాదిది. హీరో క్యారెక్టర్ కూడా కథలో భాగంగా ఉంటుంది కానీ ప్రత్యేకంగా ఏమీ ఉండదు. ఇటువంటి కథ, ఆ పాత్రలో నటించడానికి ముందుకు వచ్చిన సాయి ధరమ్ తేజ్ ను ప్రత్యేకంగా అభినందించాలి. పాత్రకు ఏం కావాలో, ఆయన అది చేశారు.'భీమ్లా నాయక్', 'బింబిసార', 'సార్'తో సంయుక్తా మీనన్ వరుస విజయాలను తన ఖాతాలో వేసుకున్నారు. అయితే, ఆయా సినిమాల్లో ఆమె పాత్ర పరిధి తక్కువ. కొన్ని కీలకమైన సన్నివేశాల్లో కనిపించారు. 'విరూపాక్ష'లో అలా కాదు... చివరకు వచ్చే సరికి కథే ఆమె పాత్ర మీద నడుస్తుంది. ఆ సన్నివేశాల్లో నటిగా సంయుక్త నటన నెక్స్ట్ లెవల్. కమర్షియల్ సినిమా కథానాయిక పరిధి దాటి నటిగా ప్రూవ్ చేసుకునే అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకున్నారు.సాయి చంద్, సోనియా సింగ్, అజయ్, రవి కృష్ణ, సునీల్, యాంకర్ శ్యామల, రాజీవ్ కనకాల... ప్రతి ఒక్కరూ తమకు ఇచ్చిన పాత్రలకు న్యాయం చేశారు. దర్శకుడు కార్తీక్ దండు అందరి నుంచి మంచి నటన రాబట్టుకున్నారు. చివరగా చెప్పేది ఏంటంటే? : అవుట్ అండ్ అవుట్ థ్రిల్లర్ 'విరూపాక్ష'. సినిమాలో నిదానంగా నడిచిన సన్నివేశాలు కొన్ని ఉన్నాయి. అవసరమా అనిపించే ప్రేమకథ ఉంది. క్షుద్ర పూజలు, మరణాలు వంటి అంశాల కారణంగా పిల్లలతో కలిసి దీనికి ఫ్యామిలీ ఆడియన్స్ వెళ్ళలేరు. అటువంటి చిన్న చిన్న తప్పులు పక్కన పెడితే... థ్రిల్స్ మాత్రం నెక్స్ట్ లెవల్! ఇంటర్వెల్ ముందు, ఆ తర్వాత... క్లైమాక్స్ ముందు వచ్చే ట్విస్ట్ 'వావ్' అనిపిస్తాయి. షాక్ c థ్రిల్ ఇస్తాయి. థియేటర్లలోకి వెళ్ళండి... టికెట్ రేటుకి సరిపడా థ్రిల్లును, భయాన్ని పొందండి.










Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950